మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 1-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 2 Issue: 2

Circulated to Telangana
Published from Jagitial

01 జూలై 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:49 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి పాడ్యమి ఉ. 7:38 వరకు తరువాత విదియ సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పూర్వాషాఢ ఉ. 6:43 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం ఇంద్ర మ. 3:53 వరకు కరణం కౌలవ ఉ. 7:38 వరకు తైతుల రా. 8:38 వరకు వర్జ్యం మ. 3:43 నుండి సా. 5:29 వరకు దుర్ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:45 వరకు రాహుకాలం మ. 12:19 నుండి మ. 1:57 వరకు యమగండం ఉ. 7:26 నుండి ఉ. 9:04 వరకు గుళికాకాలం ఉ. 10:42 నుండి మ. 12:19 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:13 నుండి తె. 5:01 వరకు అమృత ఘడియలు రా. 2:20 నుండి తె. 4:06 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున





# దోసెడు నీళ్లు.. 20 లక్షల కోట్లు!



## 2030 నాటికి భారత్‌లో నీటి డిమాండ్ రెండింతలు


**దశాబ్దంలో 20 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం**

**మంచి నీటి వనరుల్లో భారత్ వద్ద ఉన్నది 4 శాతమే**

**పట్టణీకరణతో తీవ్రం అవుతున్న నీటి సంక్షోభం**

**డేటా సెంటర్లు, సెమీకండక్టర్ల తయారీతో జటిలం**

**పీఎల్ క్యాపిటల్ నివేదికలో దిగ్భ్రాంతికర అంశాలు**



నదిలో నీళ్లు తాగినోళ్లం.. నదినే ఖరాబ్ చేసినం
చెరువులో నీళ్లు తాగినోళ్లం.. చెరువును కంపు చేసినం
వాగులో నీళ్లు తాగినోళ్లం.. వాగే లేకుండా చేసినం
బాయిల నీళ్లు తాగినోళ్లం.. బాయిల్నే బొంద వెట్టినం
ప్యాషన్‌గా ప్యూరిఫైడ్ వాటర్ తాగుతున్నం..
స్టైల్‌గా ఉంటదని నీళ్ల బాటిల్ కొంటున్నం..
ఈ దెబ్బ మనల్ని ఎంత గట్టిగ కొడ్తదో తెల్సా??
వచ్చే పదేళ్లలో రూ.20 లక్షల కోట్ల దందా చేస్తదట!
అంటే.. మన పైసలు 'నీళ్ల'లా ఖర్చవుతాయట!

న్యూఢిల్లీ: భారత్‌లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో, రాబోయే పదేళ్లలో దేశ జల రంగంలో సుమారు రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పీఎల్ క్యాపిటల్ తాజా నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం, 2030 నాటికి దేశంలో నీటి అవసరం అందుబాటులో ఉన్న నీటి పరిమాణం కంటే రెండింతలు పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితి కారణంగా నీటి శుద్ధి, మురుగునీటి శుద్ధి, మురుగునీటి పునర్వినియోగం, పంపిణీ వ్యవస్థలు, నిల్వ సదుపాయాల అభివృద్ధి వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు అవసరమవుతాయని పేర్కొంది. ప్రపంచ జనాభాలో దాదాపు 18 శాతం మంది భారతదేశంలో నివసిస్తున్నప్పటికీ,

-తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,395 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,896 |

## కాళేశ్వరం పనికిరాలే!

**ఆ ప్రాజెక్టు లేకున్నా వరి సాగులో టీజీ నం.1.. వేల కోట్ల కమీషన్లకు హడావుడిగా నిర్మాణం**

**మేం పంటకు ముందే రైతు భరోసా ఇస్తున్నం**

**మహిళలకు ఉచిత బస్సుతో ఆర్టీసీ లాభాల బాట**

**కేసీఆర్ మళ్లీ వస్తే వ్యక్తిగత జీవితాల్లోకి చూస్తాడు**

**తెలంగాణ తొలి సీఎంపై రేవంత్ తీవ్ర విమర్శలు**

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణను రూ.8.11 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని.. కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్ల కోసమే నిర్మించారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్, రైతు రుణమాఫీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు భూమి వంటి హామీల అమలులో బీఆర్ఎస్ విఫలమైందని విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించిన తరువాయి 2 వ పేజీలో...






## యాదగిరిగుట్ట బోర్డులో చిరంజీవి భార్య

**దేవస్థానం బోర్డు ఏర్పాటు.. అధికారిక ఉత్తర్వులు జారీ**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నూతన బోర్డును ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం ప్రకారం సరికొత్త పాలక మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): నూతన బోర్డుకు చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. బోర్డులో చైర్మన్‌తో పాటు సభ్యులుగా, ఎక్స్-అఫీషియో సభ్యులుగా మొత్తం 18 మందికి చోటు దక్కింది. సభ్యులుగా ఎన్నికైన వారిలో వినోద్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సురేఖ, చిలపగారి విజయరాజం, విజయేందర్ తుల్లా, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కాంతమణి, ఎం.రాఘవేందర్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్ని తగ్గించే దిశగా అమెరికాకు చెందిన ట్రిక్ రోబోటిక్స్ సంస్థ వినూత్న సాంకేతికతను అభివృద్ధి చేసింది. ట్రాక్టర్ పరిమాణంలో ఉండే ప్రత్యేక రోబోట్ల ద్వారా యూవీ-సీ అతినీలలోహిత కాంతిని ఉపయోగించి పంటలను ఆశించే శిలీంధ్రాలు, పురుగులు, వ్యాధికారకాలను నియంత్రించే విధానాన్ని రూపొందించింది. సంప్రదాయంగా రైతులు పంటలపై పురుగుమందులు, శిలీంధ్రనాశక మందులు పిచికారీ చేస్తుంటారు. అయితే ఈ కొత్త రోబోట్లు రాత్రి వేళల్లో పొలాల్లో సంచరిస్తూ పంటలపై శక్తివంతమైన యూవీ-సీ కాంతిని ప్రసరిస్తాయి. ఈ కాంతి శిలీంధ్రాలు, బూజు, మిల్డ్యూ, మైట్స్ వంటి హానికర జీవుల డీఎన్ఏను దెబ్బతీసి వాటి పెరుగుదలను అడ్డుకుంటుంది. ఫలితంగా పంటలకు వ్యాధులు వ్యాపించే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.



## రోడ్లు కరుగుతున్నయ్.. మనుషులు రాలిపోతున్నరు!

**భారీ ఉష్ణోగ్రతలతో యూరప్ అతలాకుతలం**

**వడదెబ్బలకు ఇప్పటికే 1,300 మంది మృత్యువాత**

ఎండలతో యూరప్ అట్టుడికిపోతోంది. అక్కడ సగటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ పైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు వడగాలులు, ఉక్కపోత, వడదెబ్బలతో అల్లాడుతున్నారు.

లండన్: తీవ్రమైన ఎండలు, వడగాలుల కారణంగా యూరప్‌లో 1,300 మందికి పైగా మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. ఎండల కారణంగా సాధారణ జనజీవితం స్తంభించిపోయింది. ప్రజలు ఇండ్లల్లోంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఎండ ప్రభావానికి గురైన వారికి అత్యవసర సేవలు అందించేందుకు అక్కడి సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. తరువాయి 2 వ పేజీలో...

## పుట్టుకతో పౌరసత్వం ఇచ్చుడే!



**స్పష్టం చేసిన అమెరికా సుప్రీంకోర్టు**

**అధ్యక్షుడు ట్రంప్‌కు ఎదురుదెబ్బ**

**ట్రంప్ ప్రతీకార సుంకాలు సైతం రద్దు**

వాషింగ్టన్: జన్మతః పౌరసత్వ హక్కు రద్దు విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బర్త్ రైట్ సిటిజన్‌షిప్‌ను రద్దుచేస్తూ వెలువరించిన కార్యనిర్వహాక ఉత్తర్వులను ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యతిరేకించింది. జన్మతః పౌరసత్వ హక్కు ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో చట్టాన్ని రద్దుచేయడానికి ట్రంప్ చేసిన ప్రయత్నాలకు గండిపడింది. గతేడాది అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తాను చెలాయిస్తున్న విస్తృత అధికారాలకు పరాకాష్టగా ట్రంప్ తీసుకొచ్చిన ప్రతీకార సుకాలను కొన్ని నెలల క్రితమే కోర్టు రద్దు చేసింది. జా తీర్పుతో ట్రంప్ అధికార తరువాయి 2 వ పేజీలో...

## రేపు కేబినెట్ అత్యవసర భేటీ

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్ష తన ఈ కీలక సమావేశం జరగబోతోంది.

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో జరిగే ఈ 34వ మంత్రిమండలి భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈరోజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సచివాలయంలో పరిపాలనా పరమైన హడావుడి మొదలైంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యద ర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

1.7.2026

మేషం: ఉద్యోగ పరంగా అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడతాయి ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధు మిత్రుల పై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి.

వృషభం: చేపట్టిన పనులలో విజయం కలుగుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. ఆదాయం మరింతగా పెరుగుతుంది. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

మిధునం: వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. సంఘంలో మీ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కొన్ని విషయాలు చర్చిస్తారు. కీలక వ్యవహారాలలో బంధు మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి.

కర్కాటకం: ఆకస్మిక ప్రయాణాలు వలన శారీరక శ్రమ పెరుగుతుంది. సంతాన విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆరోగ్య విషయాలలో శ్రద్ధ వహించాలి వ్యాపార పరంగా స్వంత నిర్ణయాలు కలసిరావు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. వృధా ఖర్చులుంటాయి.

సింహం: ఆదాయానికి మించిన ఖర్చులు ఉంటాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులుంటాయి.వృత్తి ఉద్యోగాలలో నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కన్య: ఉద్యోగమున అధికారుల సహాయంతో వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆత్మ విశ్వాసంతో అనుకున్న పనులు పూర్తి చేస్తారు. సంతాన శుభకార్య విషయాలలో చర్చలు చేస్తారు. మొండి బాకీలు వసూలు అవుతాయి.

తుల: నిరుద్యోగులు కష్టం ఫలించదు. రుణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణాలు వలన శారీరక శ్రమ పెరుగుతుంది. మిత్రులతో కొన్ని విషయాలలో మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది.

వృశ్చికం: గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. సమాజంలో విశేషమైన గౌరవమర్యాదలు పొందుతారు. వ్యాపార విషయంలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. దూరప్రాంతం నుండి శుభవర్తమానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి.

ధనస్సు: వృత్తి వ్యాపారాలలో ఊహించని సమస్యలు తప్పవు. ఉద్యోగమున ఆకస్మిక స్థానచలన సూచనలు ఉన్నవి. దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా చికాకు కలిగిస్తుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి.

మకరం: దూర ప్రాంత బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నిరుద్యోగులు నూతన అవకాశములు పొందుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారులతో సఖ్యతగా వ్యవహరించి ప్రశంసలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా సాగుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు.

కుంభం: కుటుంబ సభ్యులతో సఖ్యతగా వ్యవరిస్తారు. ముఖ్యమైన పనులలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారాలలో కార్యసిద్ధి కలుగుతుంది. పాత మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

మీనం: నిరుద్యోగులకు అవకాశములు అందినట్టే అంది చేజారుతాయి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. దూరప్రయాణాలు అతికష్టం మీద పూర్తి చేస్తారు. చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం కనిపించదు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి.

# దోసెడు నీళ్లు.. 20 లక్షల కోట్లు!

**మొదటి పేజీ తరువాయి**

ప్రపంచంలోని మంచినీటి వనరుల్లో భారత్‌కు కేవలం 4 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, భూగర్భ జలాల అధిక వినియోగం, వ్యవసాయ అవసరాల పెరుగుదల వంటి కారణాలతో నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతోందని నివేదిక పేర్కొంది. పీఎల్ క్యాపిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (అడ్వైజరీ) విక్రమ్ కసత్ మాట్లాడుతూ, ఇతర మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు ఆర్థిక పరిస్థితులపై ఆధారపడుతుంటే, జల భద్రతకు సంబంధించిన పెట్టుబడులు మాత్రం నిర్మాణాత్మకమైనవి, ప్రభుత్వ విధానాలతో అనుసంధానమైనవి, స్థిరమైన అభివృద్ధికి అత్యవసరమైనవి అని అన్నారు. పట్టణాల విస్తరణ, పరిశ్రమల పెరుగుదల, పర్యావరణ ప్రమాణాల కఠినతరం నేపథ్యంలో నీటి శుద్ధి, నీటి పునర్వినియోగం, సముద్రజలాల ఉప్పుతీయడం (డీసాలినేషన్), రీసైక్లింగ్ కేంద్రాలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0, నమామి గంగే వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు, మురుగునీటి శుద్ధి, పారిశుధ్య మౌలిక వసతుల అభివృద్ధికి భారీ నిధులు కేటాయిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. దేశంలో ప్రతిరోజూ సుమారు 72,000 మిలియన్ లీటర్లకు పైగా మురుగునీరు ఉత్పత్తి అవుతున్నప్పటికీ, దానిని పూర్తిస్థాయిలో శుద్ధి చేసే సామర్థ్యం ప్రస్తుతం లేకపోవడంతో గణనీయమైన పరిమాణంలో మురుగునీరు నదులు, చెరువులు, ఇతర జలవనరుల్లోకి చేరుతోందని వెల్లడించింది. ఈ లోటు కారణంగా మురుగునీటి శుద్ధి, పునర్వినియోగ ప్రాజెక్టుల్లో భారీ పెట్టుబడులు వచ్చే అవకాశముందని అంచనా వేసింది. అదేవిధంగా డేటా సెంటర్లు, సెమీకండక్టర్ల తయారీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, గ్రీన్ హైడ్రోజన్, ప్రత్యేక రసాయనాల తయారీ పరిశ్రమలు అధిక స్వచ్ఛత కలిగిన నీటిని పెద్ద ఎత్తున వినియోగించనున్నందున భవిష్యత్తులో జల వనరులపై మరింత ఒత్తిడి పెరిగే అవకాశముందని నివేదిక హెచ్చరించింది.

## జల భద్రతే భారత భవిష్యత్తు

భారతదేశంలో నీటి కొరత అనేది ఇక భవిష్యత్తులో వచ్చే సమస్య కాదు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు ప్రతి ఏడాది తీవ్ర కరువు, భూగర్భ జలాల క్షీణత, తాగునీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వాతావరణ మార్పులు, అసమాన వర్షపాతం, జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామిక విస్తరణ వంటి కారణాలతో దేశంలోని జల వనరులపై అపూర్వమైన ఒత్తిడి ఏర్పడుతోంది. ప్రపంచ జనాభాలో దాదాపు ఐదవ వంతు ప్రజలు భారతదేశంలో నివసిస్తున్నప్పటికీ, ప్రపంచ మంచినీటి వనరుల్లో మన వాటా కేవలం నాలుగు శాతం మాత్రమే. ఈ పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును సమర్థంగా వినియోగించడం తప్పనిసరి అయింది. దేశంలో కరువు ఏర్పడినప్పుడు మొదట ప్రభావితమయ్యేది వ్యవసాయ రంగమే. పంటలు ఎండిపోవడం, దిగుబడులు తగ్గడం, రైతుల ఆదాయం క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సంక్షోభం ఏర్పడటం సాధారణమవుతోంది. నీటి కొరత కారణంగా పశుసంపద కూడా ప్రమాదంలో పడుతోంది. పట్టణాల్లో తాగునీటి సరఫరా తగ్గిపోవడంతో ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో రోజుకు కొన్ని గంటలపాటు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. దీనివల్ల సాధారణ ప్రజల జీవనం తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. భారత్‌లో సాగునీటి అవసరాల్లో ఎక్కువ భాగం భూగర్భ జలాల ద్వారానే తీర్చబడుతోంది. అయితే, అవసరానికి మించి బోర్లు తవ్వడం, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు తక్కువగా ఉండటం వల్ల అనేక జిల్లాల్లో భూగర్భ జలాల మట్టం ప్రమాదకరంగా పడిపోతోంది. ప్రస్తుతం దేశంలో రోజుకు వేల కోట్ల లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతున్నప్పటికీ, అందులో గణనీయమైన భాగం శుద్ధి కాకుండానే నదులు, చెరువులు, సముద్రంలోకి చేరుతోంది. ఈ నీటిని శుద్ధి చేసి పరిశ్రమలు, ఉద్యానవనాలు, నిర్మాణ రంగం, వ్యవసాయానికి వినియోగిస్తే స్వచ్ఛమైన తాగునీటిపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.



### ప్రతి పౌరుడి బాధ్యత

- వర్షపు నీటి సంరక్షణ తప్పనిసరి చేయాలి.
- ప్రతి ఇంటిలో నీటి వృథాను నివారించాలి.
- మురుగునీటి శుద్ధి, పునర్వినియోగాన్ని ప్రోత్సహించాలి.
- చెరువులు, కుంటలు, కాలువలను ఆక్రమణల నుంచి రక్షించాలి.
- భూగర్భ జలాల వినియోగాన్ని శాస్త్రీయంగా నియంత్రించాలి.
- నీటిని ఆదా చేసే సూక్ష్మ సాగు పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలి.

### ముఖ్య గణాంకాలు

| అంశం | గణాంకం |
|---|---|
| ప్రపంచ జనాభాలో భారత్ వాటా | సుమారు 18% |
| ప్రపంచ మంచినీటి వనరుల్లో భారత్ వాటా | 4% |
| 2030 నాటికి నీటి డిమాండ్ | అందుబాటులో ఉన్న నీటి కంటే రెండింతలు అయ్యే అవకాశం |
| జల రంగంలో అంచనా పెట్టుబడులు | రూ.20 లక్షల కోట్లు (రాబోయే దశాబ్దంలో) |
| దేశంలో రోజువారీ మురుగునీటి ఉత్పత్తి | 72,000 మిలియన్ లీటర్లకు పైగా |

# కాళేశ్వరం పనికిరాలే!

**మొదటి పేజీ తరువాయి**

రైతు భరోసా సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని.. దశలవారీగా రైతు భరోసా నిధులు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపైనా రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రస్తావించిన రేవంత్ రెడ్డి.. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి మళ్లీ తొంగిచూస్తారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని భార్యాభర్తలు మాట్లాడుకునే ఫోన్లు కూడా విన్నారని.. తన ఫోన్లను దొంగచాటుగా ట్యాప్ చేశారని కేసీఆర్ కుమార్తెనే చెప్పిందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌పై కూడా సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రూ.వేల కోట్ల కమీషన్ల కోసమే హడావుడిగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఇప్పుడు కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం వరి సాగులో దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రైతు రుణమాఫీ, దళితులకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం వంటి హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయడంలో మాత్రం తీవ్రంగా విఫలం అయిందని.. సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. రైతులు వరి వేయొద్దని బెదిరించి బీఆర్ఎస్ ప్రభుత్వం పంట కొనుగోలు కూడా సరిగా చేయలేదని తేల్చి చెప్పారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం రైతులకు సాగు ప్రారంభంలోనే రైతు భరోసా అందిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వంపైనా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి.. ప్రతీ కుటుంబానికి రూ.15 లక్షలు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చేసిన హామీలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెరవేర్చలేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో 2 ఏళ్లలోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆర్టీసీని లాభాల బాట పట్టించినట్లు వెల్లడించారు.

## రెండెకరాల్లోపు వాళ్లకు భరోసా

తొలి విడతలో భాగంగా రెండు ఎకరాల లోపు భూమి కలిగిన రైతుల బ్యాంకు అకౌంట్లలో రూ.2,482 కోట్లను జమ చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతులకు దశలవారీగా రైతు భరోసా నిధులను ఖాతాల్లో వేస్తామని తెలిపారు. రైతులపై పెట్టుబడి భారం తగ్గించి.. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తేల్చి చెప్పారు. ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పథకం కింద రాష్ట్రంలోని 73.32 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. తొలి విడతలో 2 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించారు. ఈ దశలో సుమారు 44.28 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482 కోట్లను ఇవాళ జమ చేశారు. మిగిలిన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇటీవల కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు కూడా రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం తమ వివరాలను జూలై 5వ తేదీ లోపు సమీప వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)కు అందించాలని సూచించింది.

# పుట్టుకతో పౌరసత్వం ఇచ్చుడే!

**మొదటి పేజీ తరువాయి**

దాహానికి మరోసారి బ్రేక్ పడినట్లయింది. గత వారం వలసదారులను దేశ బహిష్కరణ నుంచి రక్షణ కల్పించే నిబంధనలను రద్దుచేయడానికి ట్రంప్‌నకు అనుమతించిన తీర్పుతో సహా ఇతర వలస కేసుల్లో న్యాయమూర్తులు అధ్యక్షుడి అధికారాలకే మద్దతు పలికారు. కానీ, తాజా నిర్ణయంలో మాత్రం.. కేవలం ఒక సంతకంతో పుట్టుకతో వచ్చే పౌరసత్వం నిర్వచనాన్ని ట్రంప్ మార్చలేరని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మెజారిటీ న్యాయమూర్తుల అభిప్రాయాన్ని వెల్లడిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్.. అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న తల్లిదండ్రులకు జన్మించిన పిల్లలు కూడా 14వ సవరణలోని పౌరసత్వ నిబంధనకు అర్హులని పేర్కొన్నారు. "అప్పుడు, ఇప్పుడు కూడా పౌరసత్వం అనేది హక్కులను కలిగి ఉండే హక్కు.. మన రాజకీయ సమాజంలో స్వేచ్ఛగా భాగస్వామ్యం పంచుకోవడం.. 14వ సవరణ రూపకర్తలు ఆ వాగ్దానాన్ని 'ఈ దేశంలో జన్మించిన ప్రతి వ్యక్తికి' విస్తరించారు. ఈ రోజు మనం ఆ వాగ్దానాన్ని నిలబెడుతున్నాం" అని చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ రాశారు. కానీ, కోర్టులోని ఇతర ముగ్గురు కన్జర్వేటివ్ న్యాయమూర్తులు జస్టిస్ క్లారెన్స్ థామస్, జస్టిస్ శామ్యూల్ అలిటో, జస్టిస్ నీల్ గోర్సచ్‌లు మాత్రం ఈ తీర్పుతో విభేదించారు. ఈ నిర్ణయం అమెరికా పౌరసత్వ విలువను తగ్గిస్తుందని, ఇది కాలపరీక్షకు నిలిచే అవకాశం లేదని థామస్ అన్నారు. ట్రంప్ నియమించిన మరో న్యాయమూర్తి జస్టిస్ బ్రెట్ కావనాగ్ మాట్లాడుతూ.. తాను మరింత క్లిష్టమైన ప్రాతిపదికన ఈ ఆర్డర్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చి ఉండేవాడ్ని అని అన్నారు. ఈ ఉత్తర్వు 14వ రాజ్యాంగ సవరణను ఉల్లంఘించనప్పటికీ.. 1952 నాటి వలస చట్టానికి విరుద్ధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తాను రెండోసారి అధికారం చేపట్టిన మొదటి రోజే.. అమెరికాలో జన్మించినవారి తల్లిదండ్రులలో కనీసం ఒకరు దేశ పౌరుడు లేదా చట్టబద్ధమైన శాశ్వత నివాసి కాకపోతే, వారి పౌరసత్వాన్ని గుర్తించకూడదని ఫెడరల్ ఏజెన్సీలను ట్రంప్ ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వలసదారుల హక్కుల సంఘాలు, 22 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ పలు పిటిషన్లు దాఖలు చేశారు.

# రేపు కేబినెట్ అత్యవసర భేటీ

**మొదటి పేజీ తరువాయి**

చేసే పనిలో పడ్డారు. ఈ ప్రతిపాదనలను తెలుగు అనువా దంతో సహా రేపు మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఏ శాఖలోనైనా ఎలాంటి అజెండా అంశాలు లేకపోతే.. 'నిల్' రిపోర్టునైనా సరే నిర్ణీత సమయానికి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు, సమావేశం జరిగే సమయంలో ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా గట్టి చర్యలు చేపట్టింది. కేబినెట్ భేటీ ముగిసే వరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులందరూ కచ్చితంగా తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. దీంతో పాటు ప్రొటోకాల్ డైరెక్టర్, హార్టికల్చర్ డైరెక్టర్, ట్రాన్స్‌లేషన్స్ డైరెక్టర్, టీజీటీఎస్ యూనిట్ మేనేజర్లు సమావేశానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# రోడ్లు కరుగుతున్నయ్.. మనుషులు రాలిపోతున్నరు!

**మొదటి పేజీ తరువాయి**

డిమాండ్‌కు తగ్గట్లుగా సేవలు అందించలేకపోతున్నారు. వృద్ధులు, పిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. యూరప్‌లోని అనేక దేశాలు ఎండ, వడగాల్పుల ప్రభావానికి గురవుతున్నాయి. జర్మనీలో అత్యధికంగా గత ఆదివారం 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఫ్రాన్స్‌లో 43.3 డిగ్రీలు, బ్రిటన్‌లో 38.8 డిగ్రీల ఎండ నమోదైంది. 1950 తర్వాత ఈ రేంజ్‌లో ఎండలు పెరగడం ఇదే మొదటిసారి. సగటున యూరప్‌లో వేసవిలో 20-27డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదవుతుంటాయి. అలాంటిది 40 డిగ్రీలకు పైగా టెంపరేచర్ పెరగడంతో స్థానికులు తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు రాత్రిపూట ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకుపైనే నమోదవుతున్నాయి. దీంతో పగలూ, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలతో పోలిస్తే యూరప్ ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు. గత పది రోజుల్లోనే యూరప్ వ్యాప్తంగా 1300 మందికిపైగా ఎండల కారణంగా మరణించారు. వీరిలో పిల్లలు, యువత, వృద్ధులు, మహిళలు కూడా ఉన్నారు. ఫ్రాన్స్, జర్మనీ, బెర్లిన్ వంటి దేశాలు అధికంగా ఎండ ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ బాధితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. కొన్నిచోట్ల వారికి తగిన వైద్యం అందించలేనంతగా ఆస్పత్రుల్లో డిమాండ్ పెరిగిపోయింది. 2022 నుంచి అక్కడ ఎండలు బాగా పెరిగిపోతున్నాయి. ఈ ఐదేళ్లో ఎండల కారణంగా అక్కడ 60,000 మంది మరణించారు. యూరప్ శీతల ఖండం. అందువల్ల అక్కడి ఇండ్లు, ఇతర నిర్మాణాలు వెచ్చగా ఉండేందుకు డిజైన్ చేశారు. దీంతో ఇంట్లోని వారు కూడా త్వరగా ఎండ ప్రభావానికి గురవుతున్నారు.

## కరిగిపోతున్న రోడ్లు

యూరప్‌లోని పలు దేశాల్లో ఇటీవల నమోదవుతున్న 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలకే తారు రోడ్లు కరిగిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన చాలామందికి, 45 డిగ్రీల వేడిని సైతం తట్టుకునే మన రోడ్లతో పోల్చి, యూరప్ రోడ్ల నాణ్యతపై సందేహాలు వస్తున్నాయి. అయితే, ఇది నిర్మాణ లోపం కాదు, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించే శాస్త్రీయ ఇంజినీరింగ్ విధానమే దీనికి కారణం. యూరప్ దేశాల్లో శీతాకాలంలో ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే తక్కువకు పడిపోతాయి. ఆ సమయంలో రోడ్లు గడ్డకట్టి పగుళ్లు రాకుండా ఉండేందుకు, అక్కడ మృదువుగా ఉండే 'సాఫ్ట్ బిటుమిన్' (తారులో ఒక రకం)ను ఉపయోగిస్తారు. ఇది చలిని బాగా తట్టుకుంటుంది, కానీ దీనికి వేడిని తట్టుకునే సామర్థ్యం తక్కువ. అందుకే, బయటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటినప్పుడు, సూర్యరశ్మికి నేరుగా వేడెక్కే రోడ్డు ఉపరితలం ఉష్ణోగ్రత 50-60 డిగ్రీలకు చేరి, తారు మెత్తబడి కరిగిపోతుంది. ఇందుకు భిన్నంగా, భారతదేశంలో ఏళ్ల తరబడి తీవ్రమైన వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా, అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే 'హార్డ్ బిటుమిన్' (గట్టి తారు)ను రోడ్ల నిర్మాణంలో వాడతారు. వీజీ-30, వీజీ-40 వంటి గ్రేడ్ల తారును ఉపయోగించడం వల్ల, 45 డిగ్రీల వేడిలో కూడా మన రోడ్లు స్థిరంగా ఉంటాయి. మన రోడ్లు వర్షాలకు, నిర్వహణ లోపం వల్ల పాడవుతాయే తప్ప, సాధారణంగా ఎండలకు కరిగిపోవు.

# యాదగిరిగుట్ట బోర్డులో చిరంజీవి భార్య

**మొదటి పేజీ తరువాయి**

నాయక్ ఫౌండర్ ట్రస్టీ, ఎక్స్-అఫీషియో సభ్యులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, దేవాదాయ శాఖ కమిషనర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) వైస్ చైర్మన్, యాదగిరిగుట్ట దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో), సీనియర్ ప్రధాన అర్చకులు ఈ బోర్డులో వ్యవహరిస్తారు. అనూహ్యంగా బోర్డులో సభ్యురాలిగా మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖకు చోటు కల్పించారు. ఎక్స్-అఫీషియో సభ్యులు, ఫౌండర్ ట్రస్టీ మినహా మిగిలిన నామినేటెడ్ సభ్యులు, చైర్మన్ పదవీ కాలం వారు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి రెండు సంవత్సరాల పాటు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అమల్లో ఉంటుంది. నూతనంగా నియమితులైన చైర్మన్, సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించడానికి యాదగిరిగుట్ట దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది.

# సీఎస్ఐఆర్-ఐఐసీటీలో

# 4 అత్యాధునిక పరిశోధన కేంద్రాలు

## ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్.. నూతన హాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన

హైదరాబాద్, జూన్ 30 (పీఐబీ): దేశంలో శాస్త్రీయ పరిశోధన మౌలిక సదుపాయాలు, సాంకేతిక ఆవిష్కరణలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్--ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఐసీటీ) ప్రాంగణంలో నాలుగు అత్యాధునిక పరిశోధన సౌకర్యాలను కేంద్ర శాస్త్ర, సాంకేతికత, భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మంగళవారం ప్రారంభించారు. అదే సందర్భంగా 200 మంది విద్యార్థులు నివసించే సామర్థ్యం కలిగిన ఆధునిక హాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ప్రారంభించిన పరిశోధన సౌకర్యాల్లో ఫ్లోరో కెమికల్స్‌కు సంబంధించిన అధునాతన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రం, వస్త్ర పరిశ్రమ వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం, కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్ పరిశోధనా కేంద్రం, సస్టెయినబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలు, పారిశ్రామిక సాంకేతిక అభివృద్ధిలో సీఎస్ఐఆర్-ఐఐసీటీ అందిస్తున్న సేవలను అభినందించారు. శాస్త్ర సాంకేతికత ఆధారిత ఆర్థికాభివృద్ధి, సాంకేతిక స్వావలంబన, సుస్థిర అభివృద్ధి ద్వారా 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో దేశ పరిశోధనా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. జాతీయ అవసరాలకు అనుగుణంగా, పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పరిశోధనలపై శాస్త్రవేత్తలు మరింత దృష్టి సారించాలని ఆయన సూచించారు. అంకుర సంస్థలకు (స్టార్టప్‌లు) మద్దతు, మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ, పరిశ్రమలతో భాగస్వామ్యాలు వంటి అంశాల్లో సీఎస్ఐఆర్-ఐఐసీటీ చేస్తున్న కృషిని ప్రశంసించారు.




### 200 మంది పరిశోధకులకు ఆధునిక హాస్టల్

సంస్థలో నిర్మించనున్న కొత్త హాస్టల్ సముదాయం 200 మంది విద్యార్థులు, పరిశోధకులకు అత్యాధునిక వసతులతో కూడిన సురక్షిత నివాసాన్ని కల్పించనుంది. ఈ హాస్టల్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన యువ పరిశోధకులను ఆకర్షించడంతో పాటు పరిశోధనలకు అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డీ. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, సంస్థకు ఎనిమిది దశాబ్దాల విశిష్ట చరిత్ర ఉందన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, ఆరోగ్య రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి ఉపయోగపడే సాంకేతికతలను అభివృద్ధి చేస్తూ జాతీయ లక్ష్యాలకు సంస్థ విశేషంగా దోహదపడుతోందని తెలిపారు. నూతన పరిశోధన సౌకర్యాలు సంస్థ పరిశోధనా సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని పేర్కొన్నారు.

### పరిశోధన సౌకర్యాల ప్రత్యేకత

ఫ్లోరో కెమికల్స్ పరిశోధన కేంద్రం ద్వారా ఔషధాలు, అగ్రో కెమికల్స్, శీతలీకరణ కారకాలు, ఎలక్ట్రానిక్స్, ప్రత్యేక రసాయనాల తయారీలో ఉపయోగించే తదుపరి తరం ఫ్లోరో కెమికల్స్ అభివృద్ధికి ఊతం లభించనుంది. దీంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు స్వదేశీ సాంకేతికత అభివృద్ధికి ప్రోత్సాహం లభించనుంది. వస్త్ర పరిశ్రమ వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం ద్వారా తక్కువ ఖర్చుతో పర్యావరణహిత సాంకేతికతను వినియోగించి వ్యర్థ జలాల శుద్ధి చేపట్టనున్నారు. ఈ కేంద్రం ద్వారా సిరిపురం ప్రాంతంలోని సుమారు 6,700 మంది ప్రజలు ప్రయోజనం పొందనుండగా, దేశంలోని ఇతర టెక్స్‌టైల్ క్లస్టర్లకు కూడా ఇది ఆదర్శంగా నిలవనుంది. కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్ కేంద్రం ఔషధాలు, ఫైన్ కెమికల్స్, ప్రత్యేక రసాయనాల తయారీలో నాణ్యత, ఉత్పాదకతను పెంచడమే కాకుండా వ్యర్థాలు, ఇంధన వినియోగాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించనుంది. సస్టెయినబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్ ద్వారా ప్రయోగశాల స్థాయి పరిశోధనలను పారిశ్రామిక స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన పైలట్ స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్‌కు చెందిన వివిధ ప్రయోగశాలల డైరెక్టర్లు, జాతీయ శాస్త్రీయ సంస్థల అధిపతులు, ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## మహేశ్ బాబు ఏఎంబీ సినిమాస్‌పై జీఎస్టీ ట్రైబ్యునల్ కొరడా

**రూ.1.1 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశం!**

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబుకు చెందిన హైదరాబాద్‌లోని ప్రముఖ మల్టీప్లెక్స్ ఏఎంబీ సినిమాస్‌కు గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ భారీ షాక్ ఇచ్చింది. పన్ను తగ్గింపు ప్రయోజనాలను ప్రేక్షకులకు బదిలీ చేయకుండా యాంటీ-ప్రాఫిటీరింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను, సుమారు రూ.1.1 కోట్లను కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల సంక్షేమ నిధుల్లో జమ చేయాలని ఆదేశించింది. 2019 జనవరి 1 నుంచి సినిమా టికెట్లపై జీఎస్టీ రేట్లను కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. రూ.100 లోపు టికెట్లపై 18 శాతం నుంచి 12 శాతానికి, రూ.100 పైబడిన టికెట్లపై 28 శాతం నుంచి 18 శాతానికి పన్ను తగ్గింది. అయితే, ఈ తగ్గింపు ప్రయోజనాన్ని ప్రేక్షకులకు అందించడానికి బదులుగా, ఏఎంబీ సినిమాస్ యాజమాన్యం టికెట్ బేస్ ధరను పెంచి, పన్ను తగ్గింపుకు ముందు ఉన్న ధరలనే కొనసాగించిందని ట్రైబ్యునల్ తన విచారణలో గుర్తించింది. దీని ద్వారా నిబంధనలను ఉల్లంఘించి అదనపు లాభం ఆర్జించినట్లు తేల్చింది. ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయని, నిర్వహణ ఖర్చులు పెరిగాయని థియేటర్ యాజమాన్యం చేసిన వాదనలను ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. సీజీఎస్టీ చట్టంలోని సెక్షన్ 171 ప్రకారం పన్ను తగ్గింపు ప్రయోజనాన్ని తప్పనిసరిగా వినియోగదారులకు బదిలీ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ఏఎంబీ సినిమాస్‌తో పాటు నగరంలోని విశ్వనాథ్ సినిమా హాల్, జ్యోతి థియేటర్, బ్రహ్మరాంబ సినిమా వంటి మరో ఆరు థియేటర్లకు కూడా ట్రైబ్యునల్ ఇదే తరహా ఆదేశాలు జారీ చేసింది. మొత్తం మీద ఈ థియేటర్లన్నీ కలిపి సుమారు రూ.1.7 కోట్లు డిపాజిట్ చేయాల్సి ఉంది. ఈ ఉల్లంఘనలు 2020 జనవరి 1కి ముందు జరగడంతో, ఆ తర్వాత అమల్లోకి వచ్చిన జరిమానా నిబంధనలు వర్తించవని ట్రైబ్యునల్ పేర్కొంది. అయితే, కొన్ని కేసుల్లో డిపాజిట్ చేయాల్సిన మొత్తంపై వడ్డీ వర్తించే అవకాశం ఉంది.

## దుద్దిళ్ల దంపతుల మార్ఫింగ్ వీడియో

**సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు**

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన భార్య, సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్ దంపతులను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక మార్ఫింగ్ వీడియో కలకలం రేపుతోంది. వారిద్దరిపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డీప్ ఫేక్)తో క్రియేట్ చేసిన అభ్యంతరకర మార్ఫింగ్ వీడియో ఫేస్‌బుక్‌లో ప్రత్యక్షమవ్వడం దుమారం రేపుతోంది. శ్రీధర్ బాబు దంపతుల వ్యక్తిగత, వృత్తిపరమైన ఇమేజ్‌ను డ్యామేజ్ చేయాలనే పక్కా స్కెచ్‌తో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఫేస్‌బుక్‌లో ఈ అభ్యంతరకర మార్ఫింగ్ వీడియోలను పోస్టు చేశారు. ఈ వీడియోలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది శశిభూషణ్ ఫిర్యాదు చేశారు. సమాజంలో ఎంతో ఉన్నతమైన హోదాల్లో ఉన్న ఒక మంత్రి, ఒక ఐఏఎస్ అధికారిణి ప్రతిష్ఠను బజారున పడేసేలా ఈ ఫేక్ వీడియోలు ఉన్నాయంటూ తన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. ఈ తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తులను గుర్తించి ఐటీ యాక్ట్ కింద కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వంతో పనిచేయడానికి కాదు మేమున్నది!

**వీడ్కోలు సభలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు**

అమరావతి,జూన్ 30 (ఈవార్తలు): "ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికో, సహకరించడానికో న్యాయమూర్తులుగా మేము ఇక్కడ లేము. చట్టబద్ధమైన పాలన అమలయ్యేలా చూడటం, పౌరుల హక్కులను ప్రభుత్వం ఉల్లంఘించకుండా కాపాడటమే మా బాధ్యత" అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఆరున్నరేళ్ల పాటు హైకోర్టు న్యాయమూర్తిగా విశేష సేవలందించిన ఆయన, సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు మొదటి కోర్టు హాలులో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన భావోద్వేగ ప్రసంగం చేశారు. జనవరి 13, 2020న న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన నాటి నుంచి రాజ్యాంగానికి కట్టుబడి పనిచేశానని జస్టిస్ రఘునందన్ రావు తెలిపారు. తన పదవీకాలంలో దాదాపు 25,000 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. "ఒకప్పుడు ధనవంతుల తరఫున వాదించే న్యాయవాదిగా ఉన్న నాకు, న్యాయమూర్తి అయ్యాకే నిస్సహాయుల కష్టాలు తెలిశాయి.

# రూ.కోటి ఇప్పించి తీరుతాం

**సిగాచి బాధితులకు న్యాయం చేస్తాం**

**మంత్రి వివేక్ వెంకటస్వామి**



గోదావరిఖని, జూన్ 30 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో బాధిత కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు ప్రభుత్వం కంపెనీపై ఒత్తిడి కొనసాగిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం అందే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, సిగాచి ప్రమాదంలో 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి తాను వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వం మొదటి నుంచే బాధిత కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. సిగాచి యాజమాన్యాన్ని పలుమార్లు పిలిపించి బాధితులకు తగిన పరిహారం చెల్లించాలని ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చిందని, ఆ ప్రయత్నాల ఫలితంగానే మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సుమారు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందిందని తెలిపారు. బాధితులకు రూ.1 కోటి పరిహారం అందే వరకు ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రమాదానికి సంబంధించి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని, పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కంపెనీ సీఎండీని అరెస్ట్ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ కూడా తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టారని చెప్పారు. హైకోర్టులోనూ బాధితులకు పూర్తి న్యాయం చేయాలనే ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా తెలియజేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలను మంత్రి వివేక్ వెంకటస్వామి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కొండగట్టు ఆర్టీసీ బస్సు ప్రమాదం, ఇంటర్మీడియట్ ఫలితాల వివాదం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ, అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిగాచి ప్రమాదంలో బాధిత కార్మికులు, వారి కుటుంబాలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు అన్ని చర్యలు కొనసాగుతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.




# జూన్ 30 చీకటి రోజు

**సిగాచి మృతులకు రేవంత్ సర్కారు అన్యాయం**

**మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం**

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 హెచ్‌పీకి అనుమతి తీసుకుని 1777 హెచ్‌పీ నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ ఎన్‌ఓసీ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. "మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు" అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

## రిజిస్ట్రేషన్ ఆఫీసులు స్టక్!

**నిలిచిన భూముల రిజిస్ట్రేషన్లు**

**రెండు రోజులుగా పనిచేయని సర్వర్లు!**

**స్తంభించిన స్లాట్ బుకింగ్, చలాన్, ఈ-కేవైసీ సేవలు**

**కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు**

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు గత రెండు రోజులుగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్



చెల్లింపులు, ఈ-కేవైసీ వంటి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్‌లు బుక్ చేసుకున్న క్రయ, విక్రయదారులు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నా, గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందనే విషయంపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా సమాచారం లేదు. వారు ప్రజలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీంతో కార్యాలయాల వద్ద గందరగోళం నెలకొంది. సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యను గుర్తించి సర్వర్లను పునరుద్ధరించేందుకు రాష్ట్ర స్థాయి సాంకేతిక బృందం చర్యలు చేపట్టిందని ఉన్నతాధికారులు తెలిపారు. సేవలు ఎప్పటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

## బండి సంజయ్, రాజాసింగ్‌కు ఊరట

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. అసలు విషయానికి వస్తే... హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అటు.. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కూడా నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు పూర్తిగా కొట్టివేస్తూ, రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్‌లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై 153ఏ, 295ఏ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఏ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది.

## హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్‌ను విస్తరించండి

**సునీల్ మిట్టల్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం**

హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ రంగాల్లో కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధీ పెవిలియన్‌లో రేవంత్ రెడ్డిని మంగళవారం సునీల్ భారతి మిట్టల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులకు అనుకూలంగా తీసుకొచ్చిన సంస్కరణలపై సీఎం వివరించారు. రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా మారుతోందని పేర్కొన్న సీఎం విద్యా రంగంలో చేపడుతున్న మార్పులను కూడా వివరించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు తగ్గట్టుగా యువతకు నైపుణ్యాలు అందించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి కూడా సునీల్ మిట్టల్‌కు వివరించారు.

# ఇల్లు అద్దెకిస్తే 18 కోట్ల మోసం

**ఢిల్లీలో వితంతువుకు టోకరా**

న్యూఢిల్లీ: తాను అద్దెకిచ్చిన ఫ్లాట్లపై ఏకంగా రూ.18 కోట్ల రుణాలు తీసుకున్నారని తెలిసి ఢిల్లీకి చెందిన ఓ వితంతువు నివ్వెరపోయారు. కేవలం అద్దె ఒప్పందాన్ని అడ్డం పెట్టుకుని కేటుగాళ్లు పన్నిన ఈ భారీ మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిని ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అరెస్ట్ చేసింది. వివరాల్లోకి వెళితే, తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్‌కు చెందిన ఉషా రాణి సేథి (55) అనే వితంతువు 2012లో తన రెండు ఫ్లాట్లను సచిన్, సంజయ్ అనే వ్యక్తులకు అద్దెకిచ్చారు. కొంతకాలం తర్వాత వారు ఇల్లు ఖాళీ చేశారు. అయితే, 2013లో పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ నుంచి ఉషా రాణికి రూ.70 లక్షల లోన్ డిఫాల్ట్ అయినట్లు నోటీసులు వచ్చాయి. దీంతో షాక్‌కు గురైన ఆమె పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నిందితులు ఉషా రాణి పేరుతో నకిలీ పాన్ కార్డు సృష్టించి, ఆమె సంతకాలను ఫోర్జరీ చేశారు. ఒడిశాకు చెందిన మరో మహిళ పాన్ కార్డు వివరాలు సంపాదించి, ఆమె స్థానంలో వేరే వ్యక్తిని పెట్టి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉషా ఫ్లాట్లను సచిన్ పేరు మీద అమ్మినట్లు నకిలీ సేల్ డీడ్ సృష్టించారు. ఈ నకిలీ పత్రాలను ఉపయోగించి, సచిన్ తన బావమరిది సంజీవ్ దీక్షిత్‌తో కలిసి వివిధ బ్యాంకుల నుంచి రూ.18 కోట్ల వరకు రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్‌లు పొందారు. ఈ డబ్బును 11 షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించి కాజేశారు. నిందితుడు సంజీవ్ దీక్షిత్‌పై గతంలో సీబీఐ కేసులు సహా పలు చీటింగ్ కేసులున్నాయి. 2017లో కస్టడీ నుంచి కూడా తప్పించుకున్నాడు. ఇటీవల మరో కేసులో సీబీఐ అరెస్ట్ చేయగా, జూన్ 25న ఈ కేసులో ఈవోడబ్ల్యూ అధికారులు అతడిని తిరిగి అరెస్ట్ చేసి తీహార్ జైలుకు తరలించారు. మరో నిందితుడు సచిన్ పరారీలో ఉన్నాడు.

# యెన్-రూపాయి ఒప్పందం!

**డాలర్‌తో పనిలేకుండా లావాదేవీలు.. భారత్-జపాన్ కీలక ఒప్పందం**

న్యూఢిల్లీ: భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి-యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్, జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్-జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

# యూట్యూబ్ చూసి సొంతంగా కాన్పు

**రక్తస్రావంతో మహిళ మృతి**

**తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో విషాదం**

చెన్నై: తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఒక హృదయవిదారక ఘటన వెలుగుచూసింది. కేవలం యూట్యూబ్ వీడియోల సమాచారాన్ని నమ్మి, ఇంట్లోనే ప్రసవం చేసుకోవడానికి ప్రయత్నించిన 32 ఏళ్ల శశికళ అనే మహిళ తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయింది. శశికళకు ఇది రెండో ప్రసవం. మొదటి కాన్పు సమయంలో ఆమెకు సిజేరియన్ అయింది. దాంతో అల్లోపతి వైద్యంపై ఒక రకమైన విరక్తి పెంచుకున్న ఆమె, ఈసారి ఎలాగైనా సహజ పద్ధతిలోనే ప్రసవం కావాలని గట్టిగా అనుకుంది. మళ్లీ సిజేరియన్ అవుతుందేమోనన్న భయంతో, ఈ కుటుంబం రెగ్యులర్ వైద్య పరీక్షలను, ప్రభుత్వ ఆరోగ్య కార్యకర్తల సూచనలను పూర్తిగా పక్కన పెట్టేసింది. యూట్యూబ్‌లో వచ్చే వీడియోలను చూసి ఇంట్లోనే కాన్పు చేసుకోవాలని నిర్ణయించుకుంది. చివరకు అనుకున్నట్టుగానే శశికళ ఇంట్లోనే ఒక ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చింది. కానీ, ఆ తర్వాతే అసలు సమస్య మొదలైంది. కాన్పు పూర్తయ్యాక ప్లజెంటా (మాయ)కు సంబంధించిన తీవ్రమైన సమస్యలు తలెత్తడం, విపరీతంగా రక్తస్రావం అవ్వడంతో ఆమె పరిస్థితి విషమించింది. కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పెరుందురైలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ... అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో వైద్యులు ఆమెను కాపాడలేకపోయారు. ప్రస్తుతం ఆ నవజాత శిశువు సురక్షితంగానే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల నుండి ఎలాంటి ఫిర్యాదు అందకపోయినప్పటికీ, పోలీసులు సుమోటోగా స్పందించి శశికళ భర్త కొలంతైసామిపై కేసు నమోదు చేశారు. సరియైన అవగాహన లేని ఆన్‌లైన్ ఆరోగ్య చిట్కాలు, సలహాలు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రసవ సమయాల్లో కచ్చితంగా నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ అవసరమని ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.


# సెన్సెక్స్ 250 పాయింట్లు పతనం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడం, అమెరికా-ఇరాన్ చర్చల ఫలితంపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. రోజంతా హెచ్చుతగ్గుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో నిఫ్టీ 80.50 పాయింట్లు కోల్పోయి 23,865.75 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 249.70 పాయింట్లు పడిపోయి 76,478.67 వద్ద స్థిరపడింది. మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. నిఫ్టీకి ప్రస్తుతం 24,000 స్థాయి ప్రధాన నిరోధంగా మారింది. ఈ స్థాయిని దాటితే మళ్లీ కొనుగోళ్ల జోరు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు 23,800 స్థాయి కీలక మద్దతుగా ఉందని, ఆ స్థాయి కంటే దిగువకు వెళితే మరింత ఒత్తిడి కనిపించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సెన్సెక్స్‌లో మారుతి సుజుకి, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో స్థిరపడ్డాయి. మరోవైపు ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు నష్టపోయాయి. ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిసినా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో కొనుగోళ్లు కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.02 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ఐటీ, మీడియా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. రియాల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్ రంగాల షేర్లు మాత్రం కొనుగోళ్లతో లాభాల్లో ముగిశాయి.



# మేం పాకిస్థాన్‌లో భాగం కాదు!




**పీఓకేలో తీవ్ర నిరసన.. భారత్‌తో కలుస్తామని స్పష్టీకరణ**

**రావల్ కోట్‌లో 22 రోజులుగా భారీ నిరసనలు**

**నిరసనలను అణచివేసేందుకు ఇంటర్నెట్ సేవలు బంద్**

**విదేశాల్లోని కశ్మీరీల నుంచి కూడా ఆందోళనలకు మద్దతు**

**పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. రావల్ కోట్‌లోని ఈద్గా మైదానంలో గత 22 రోజులుగా వేలాది మంది ప్రజలు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.**

రావల్ కోట్: పీఓకే పాకిస్థాన్‌లో భాగం కాదని, ఇకపై ఇస్లామాబాద్ నియంత్రణలో తాము ఉండబోమని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న పౌర హక్కుల కార్యకర్త సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ప్రభుత్వం ఆహారం, నిత్యావసరాలను అడ్డుకుంటే, తమ సరిహద్దులను భారత్ వైపు తెరుస్తామని ఆయన అన్నారు. అప్పుడు పీఓకేను తమతోనే ఉండమని ఇస్లామాబాదే వేడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. పాక్ ప్రభుత్వ అణచివేత, తీవ్రమైన ఆర్థిక కష్టాలు, ద్రవ్యోల్బణం, పాలనా వైఫల్యాలే ఈ నిరసనలకు ప్రధాన కారణాలని ఆందోళనకారులు తెలిపారు. సుమారు రెండు వారాలుగా ప్రభుత్వం ఆహార, సరఫరాల దిగ్బంధనం విధించడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనల సమాచారం బయటి ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు జూన్ 5 నుంచి ఈ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. మరోవైపు, నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో కూడా జూన్ 9 నుంచి మరో నిరసన దీక్ష కొనసాగుతోంది. ఈ ఆందోళనలకు విదేశాల్లోని పాకిస్థానీ రాయబార కార్యాలయాల వద్ద కశ్మీరీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. ముజఫరాబాద్ సహా తమ ప్రాంతానికి సంబంధించిన రాజకీయ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదని నిరసనకారులు తేల్చిచెప్పారు.

# డోర్లు లాక్ అయినా వందే భారత్ ఎక్కొచ్చు!

**భారతీయ రైల్వే శాఖ కీలక మార్గదర్శకాలు**



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వందే భారత్ రైళ్ల సేవలు విస్తరిస్తున్న నేపథ్యంలో, భారతీయ రైల్వే ప్రయాణికుల కోసం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యంగా ఈ సెమీ-హై-స్పీడ్ రైళ్లలో ఉండే ఆటోమేటిక్ డోర్ల విషయంలో ఎదురయ్యే సమస్యలపై స్పష్టత ఇచ్చింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా, రైలు బయలుదేరడానికి కొన్ని నిమిషాల ముందే ఈ డోర్లు ఆటోమేటిక్‌గా లాక్ అవుతాయి. దీనివల్ల కొన్నిసార్లు ఆలస్యంగా వచ్చిన వారు రైలు ఎక్కలేకపోతున్నారు. రైల్వే శాఖ సూచనల ప్రకారం, ఒకవేళ ప్రయాణికులు ప్లాట్‌ఫారమ్‌కు చేరుకునేసరికి తమ కోచ్ డోర్లు మూసుకుపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు రైలు వెనుక భాగంలో ఉండే గార్డు కోచ్ ద్వారా ఎక్కి, ఆ తర్వాత తమ సీట్ల వద్దకు నడుచుకుంటూ వెళ్లవచ్చు. అయితే, ఇలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రయాణికులు వీలైనంత ముందుగా స్టేషన్‌కు చేరుకోవడం ఉత్తమమని అధికారులు గట్టిగా సిఫార్సు చేస్తున్నారు. అలాగే, రైలులో ప్రయాణిస్తూ తాము దిగాల్సిన స్టేషన్‌లో దిగలేకపోయినట్లయితే, ఆందోళనతో డోర్లను బలవంతంగా తెరవడానికి ప్రయత్నించడం లేదా ఎమర్జెన్సీ చైన్ లాగడం వంటివి చేయరాదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో తప్ప చైన్ లాగితే జరిమానా విధించబడుతుందని హెచ్చరించింది. బదులుగా, వెంటనే టీటీఈ (ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్)ని సంప్రదించాలని లేదా డోర్ల వద్ద ఉండే ఎమర్జెన్సీ టాక్-బ్యాక్ సిస్టమ్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించింది. టీటీఈ తదుపరి స్టేషన్‌లో దిగేందుకు ఏర్పాట్లు చేస్తారని, అవసరమైతే నిర్దేశిత రుసుము, జరిమానా వసూలు చేయవచ్చని వివరించింది. మెట్రో రైళ్ల మాదిరిగా ప్రయాణ అలవాట్లను అలవర్చుకోవాలని రైల్వే శాఖ ప్రయాణికులను కోరింది. స్టేషన్ రాకముందే లగేజీతో సిద్ధంగా ఉండటం, త్వరగా ఎక్కడం, దిగడం వంటివి చేయాలని విజ్ఞప్తి చేసింది. ఆధునిక రైల్వే వ్యవస్థలో భద్రత, సమయపాలన కోసమే ఈ ఆటోమేటిక్ డోర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# ఈ20 పైలట్ ప్రాజెక్టే!


**అధ్యయనం కొనసాగుతోంది**

**సుప్రీం కోర్టులో కేంద్రం వెల్లడి**

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ (ఈ20) కలిపే కార్యక్రమంపై ఇంకా ప్రయోగాత్మక అధ్యయనం కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ విధానం వల్ల ఎలాంటి ప్రభావం ఉంటుందో వచ్చే ఏడాదికి స్పష్టమైన ఫలితాలు అందుతాయని వెల్లడించింది. పాత వాహనాలపై ఈ20 పెట్రోల్ ప్రభావం చూపుతుందన్న చర్చలు కొనసాగుతున్న వేళ కేంద్రం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ20 ఇథనాల్ సరఫరాకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇథనాల్ సరఫరా ఒప్పందాలు ఇప్పటికే ఖరారయ్యాయని, వాటిలో ఒక్కో సంస్థ కోసం మార్పులు చేస్తే దేశవ్యాప్తంగా అమలవుతున్న కార్యక్రమంపై ప్రభావం పడే అవకాశం ఉందని చెప్పారు. అయితే, పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న ప్రభుత్వ నిర్ణయం మారే అవకాశం లేదని అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. ఇథనాల్ సరఫరా పరిమాణం మాత్రం డిమాండ్, ఇతర పరిస్థితులను బట్టి మారవచ్చని తెలిపారు. ఈ20 పెట్రోల్‌పై కొంతకాలంగా వినియోగదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పాత వాహనాల ఇంజిన్‌కు నష్టం కలిగే ప్రమాదం ఉందని, మైలేజ్ తగ్గే అవకాశం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అలాంటి ఆరోపణలకు ఇప్పటివరకు శాస్త్రీయ ఆధారాలు లేవని కేంద్రం చెబుతోంది.

# మెటా నుంచి 'బ్రెయిన్ రీడింగ్' టెక్నాలజీ!

**ఆలోచనలను టెక్స్ట్‌గా మార్చే ఏఐ వ్యవస్థ.. ప్రత్యేక హెల్మెట్ ద్వారా మెదడులోని సంకేతాల డీకోడ్**




న్యూయార్క్: టెక్నాలజీ ప్రపంచంలో మరో సంచలనం చోటుచేసుకుంది. టెక్ దిగ్గజం మెటా మన మెదడులోని ఆలోచనలను నేరుగా చదివి, వాటిని అక్షర రూపంలోకి మార్చే ఒక విప్లవాత్మక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థను ఆవిష్కరించింది. 'బ్రెయిన్2క్వెర్టీ వీ2' పేరుతో పిలుస్తున్న ఈ టెక్నాలజీకి ఎలాంటి సర్జరీ లేదా ఇంప్లాంట్లు అవసరం లేకపోవడం అతిపెద్ద విశేషం. పక్షవాతం, మెదడుకు గాయాలు, ఇతర కారణాల వల్ల మాట్లాడే సామర్థ్యాన్ని కోల్పోయిన వారికి ఈ టెక్నాలజీ ఒక వరంలా మారనుంది. కేవలం ఆలోచనల ద్వారానే వారు ఇతరులతో సంభాషించే అవకాశం కలుగుతుంది. ఈ టెక్నాలజీ కోసం మెటా ఒక ప్రత్యేకమైన నాన్-ఇన్వేసివ్ విధానాన్ని ఉపయోగిస్తోంది. దీన్నే మాగ్నెటోఎన్‌సెఫలోగ్రఫీ (ఎంఈజీ) అని పిలుస్తున్నారు. ఇందుకోసం ఒక ప్రత్యేకమైన హెల్మెట్‌ను రూపొందించారు. చూడటానికి ఇది పాతకాలపు హెయిర్ డ్రైయర్‌లా ఉంటుంది. ఈ హెల్మెట్‌ను తలకు ధరించినప్పుడు, అది మెదడులోని న్యూరాన్ల కార్యకలాపాల వల్ల ఉత్పన్నమయ్యే అతి సూక్ష్మమైన అయస్కాంత క్షేత్రాలను గుర్తిస్తుంది. ఈ సిగ్నల్స్‌ను ఏఐ వ్యవస్థ విశ్లేషించి, వ్యక్తి ఏం టైప్ చేయాలనుకుంటున్నాడో డీకోడ్ చేసి టెక్స్ట్‌గా మారుస్తుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్టీరియోటాక్టిక్ ఎలక్ట్రోఎన్‌సెఫలోగ్రఫీ, ఎలక్ట్రోకార్టికోగ్రఫీ వంటి పద్ధతులకు బ్రెయిన్ సర్జరీ అవసరం. ఇవి చాలా ఖర్చుతో కూడుకున్నవి, ప్రమాదకరమైనవి కూడా. ఎలాన్ మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' వంటి సంస్థలు మెదడులో చిప్‌లను అమర్చడం ద్వారా ఇలాంటి ఫలితాలను సాధించాలని చూస్తున్నాయి. అయితే, మెటా తీసుకొచ్చిన ఈ కొత్త విధానం ఎలాంటి సర్జరీ లేకుండా, సురక్షితంగా, తక్కువ ఖర్చుతో పనిచేస్తుండటం గమనార్హం.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు

## కేంద్రం హై అలర్ట్!



న్యూఢిల్లీ: జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్ముకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

# రియల్ విద్య కేరాఫ్ 'రియల్ వర్సిటీ'

## ఇక్కడ రియల్ ఎస్టేట్ పాఠాలు నేర్పుతారు.. డెవలపర్లకు అవగాహన కల్పించే వేదిక

## ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దేలా శిక్షణ.. ఫౌండర్ ఉరుకుందు శెట్టి వినూత్న చర్య

అవి కమీషన్ల బాపతు పనులు..!.. బ్రోకరిజం చేయడమూ ఓ బతుకేనా..?
రోడ్ల వెంబడి తిరిగితే కడుపు నిండుతుందా?.. నువ్వు కూడా రియల్ ఎస్టేట్ చేస్తవా?
మనం తరచుగా వినే మాటలే ఇవి..!.. రూ.లక్షలు, కోట్లు తెచ్చిపెట్టే ఈ రంగంపై
ఇప్పటికీ చాలా మందిలో అనేక అనుమానాలు.. కానీ, రియల్‌ఎస్టేట్ ఎంత గొప్పదో..
చెప్తారక్కడ.. ఇంటరాక్టివ్ సెషన్స్ పెడతారు.. నెట్‌వర్క్ పెంచుకొనేలా సాయం చేస్తారు..
కస్టమర్లతో ఎలా మాట్లాడాలో శిక్షణ ఇస్తారు.. రియల్టర్‌కు ఉండాల్సిన లక్షణాలేంటో చెప్తారు..
వీలైతే నిపుణులతో సెపరేట్ కోర్సు అందిస్తారు.. అందుకే అది.. 'రియల్' వర్సిటీ అయ్యింది.




రెడ్ హిల్స్–హైదరాబాద్, జూన్ 30 (ఈవార్తలు): రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటే.. భూమి అమ్మడం, కొనడమేనా? అంటే సాధారణ వ్యక్తులు అంతే అంటారు. కొందరు బ్రోకరిజం అంటారు. ఇంకొందరు కమీషన్ బిజినెస్ అంటారు. కానీ, రియల్ ఎస్టేట్ అంటే మధ్య తరగతి కలను సాకారం చేసే వేదిక అని రియల్టర్లలో ఆత్మవిశ్వాసం నింపుతోంది 'రియల్ వర్సిటీ'. ఉరుకుందు శెట్టి అనే యువకుడు స్థాపించిన ఈ వినూత్న రియల్ ఎస్టేట్ విద్యాసంస్థ.. వందల మందికి మార్గదర్శిగా నిలుస్తోంది. ఈ వర్సిటీని స్థాపించి జూన్ 30తో ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో రెడ్ హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో గ్రోత్ కాంక్లేవ్–2026 అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు, మార్గదర్శకులు, మెంటార్లు, మోటివేషనల్ స్పీకర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు రియల్ ఎస్టేట్ రంగంలో సవాళ్లను తెలియజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైడ్రా చీఫ్ రంగనాథ్.. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న సవాళ్లను, ప్రభుత్వ నిబంధనలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రముఖ ఉపన్యాసకుడు పెరుమాళ్లు అందించిన సమాచారం భవిష్యత్తుకు పూల బాటలు వేసింది. ఇక, రియల్ ఎస్టేట్ రంగంలో సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి, ఈ రంగాన్ని ఎంతలా ప్రేమించాలి, ఈ రంగం సబ్జెక్టు లోతు ఎంత? అన్న అంశాలను ప్రస్తావించి, ఎంతో మందికి అవగాహన కల్పించారు. ఉరుకుందు శెట్టి ప్రారంభోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఆధ్యాత్మిక యోగా గురువు జగన్ గురువు.. ఆధ్మాత్మిక అంశాలను ప్రస్తావిస్తూనే, ఓర్పు, నేర్పు ఎంతటి విజయాన్ని అందిస్తాయో వివరించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో ఎంత ఓర్పు ఉండాలన్నదీ తెలియజేశారు. మోటివేషనల్ స్పీకర్ సునీల్ కుమార్ గాజుల, రియల్ విజన్ గ్రూప్ అధినేత జక్క బాలాజీ, మాజీ ప్రభుత్వ ఉద్యోగి (అడిషనల్ డైరెక్టర్) రమేశ్ బాబు, ఎడిట్ పాయింట్ రమేశ్, రియల్ వర్సిటీ చీఫ్ మెంటార్ రాఘవేంద్ర రావు దేశాయ్ తదితరులు రియల్ ఎస్టేట్ రంగంలోని తెలియని అనేక అంశాలను ప్రస్తావించారు. ఒక చానల్ పార్ట్‌నర్‌కు ఉండాల్సిన లక్షణాలు, విషయ పరిజ్ఞానం, సంస్థపై నమ్మకం, సంస్థ ఎదిగేందుకు చేయాల్సిన పనులు.. అదే సమయంలో చానల్ పార్ట్‌నర్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని కూలంకషంగా చర్చించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కోర్ టీం మెంబర్స్ సీఎఫ్ఓ మన్నె సురేశ్ కుమార్, ప్రవీణ్ కుమార్ మంగలి, దుర్గ మల్లేశ్, సాయి విజేందర్, నరేందర్, రంజిత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీర్ కావాలంటే బీటెక్ చేయాలి..!
డాక్టర్ కావాలంటే ఎంబీబీఎస్ చేయాలి..!
చార్టెడ్ అకౌంటెంట్
కావాలంటే సీఏ చేయాలి..!
ఆర్థిక రంగాన్ని శాసించే
రియల్ ఎస్టేట్ చేయాలంటే..?
దానికీ మేం పాఠాలు నేర్పుతాం అంటున్నారు
యువకుడు ఉరుకుందు శెట్టి.
రియల్ వర్సిటీని స్థాపించి
ఎంతోమంది రియల్టర్లకు ఇండస్ట్రీ
మెలకువలు నేర్పిస్తున్నారు.



## కులమతాలకు అతీతంగా పౌర హక్కుల దినోత్సవం

గంగాధర, జూన్ 30 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి గ్రామంలో కుల, మతాలకు అతీతంగా పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో ధమ్మని రాము, గ్రామ సర్పంచ్ కర్బుజా తిరుపతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అధికారులు రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, సమానత్వం, సామాజిక సామరస్యం, వివక్ష రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను పాటిస్తూ సామాజిక ఐక్యతను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ బాబు, మండల పంచాయతీ అధికారి ప్రత్యూష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, గ్రామ, మండల అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు ప్రవీణ్, ద్యావ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఉద్యోగ విరమణ సేవకు ముగింపు కాదు

**జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**

**స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటరమణకు ఘన వీడ్కోలు**

జగిత్యాల, జూన్ 30 (ఈవార్తలు): ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటరమణ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం జగిత్యాలలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటరమణను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో ఎన్నో ఏళ్లుగా నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో సేవలందించిన వెంకటరమణ శాఖకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. సమర్థవంతమైన విధి నిర్వహణతో పాటు సహోద్యోగులతో సత్సంబంధాలు కొనసాగించడం ఆదర్శనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రవి, లక్ష్మీనారాయణ, వేణు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని వెంకటరమణకు ఘనంగా వీడ్కోలు పలికారు.

## బోనాల ఉత్సవాలకు నిధులు కేటాయించాలి

**చైర్‌పర్సన్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం**

జగిత్యాల, జూన్ 30 (ఈవార్తలు): ఆషాఢ మాసం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని వివిధ దేవాలయాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయించాలని కోరుతూ బీజేపీ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొక్క గంగాధర్, కౌన్సిలర్లు కొక్కు అనిత, నిమ్మల నాగరాజు, గట్టపెల్లి మానస జ్ఞానేశ్వర్, సిరిపురం శ్రీలత శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బోనాల ఉత్సవాలకు మున్సిపాలిటీ తరఫున నిధులు మంజూరు చేసి, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# సర్‌లో అంతా భాగస్వాములు కావాలి

**కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**



మెట్‌పల్లి, జూన్ 30 (ఈవార్తలు): మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి, రాజేశ్వరరావుపేట, చెర్లకొండాపూర్, జగ్గాసాగర్, ఆత్మనగర్, రామలచక్కపేట గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సదస్సుల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. బూత్ స్థాయి నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడటం అందరి బాధ్యత అని అన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా కొరత ఏర్పడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతుబంధు వంటి పథకాల అమలులోనూ సమస్యలు నెలకొన్నాయని అన్నారు. రైతుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. త్వరలో చేపట్టనున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పాల్గొని పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు, బూత్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఏవీబీ పురంలో సమస్యలు పరిష్కరించాలి

**ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్**

కూకట్‌పల్లి, జూన్ 30(ఈ వార్తలు): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురం కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. కాలనీవాసుల ఆహ్వానం మేరకు మంగళవారం ఏవీబీ పురం కాలనీని సందర్శించిన ఆయన, కాలనీ అధ్యక్షుడు సింహాద్రి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రావు, స్థానికులతో కలిసి పలు వీధుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీ (మురుగు కాలువలు) నిత్యం పొంగిపొర్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా సెయింట్ రిటా హైస్కూల్ వెనుక ఉన్న రోడ్ నంబర్--11 ప్రాంతంలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, అక్కడ మంజీర తాగునీటి సరఫరా, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కాలనీలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు డ్రైనేజీ, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, శివశంకర్, ఆర్. వాసు, గోవింద్, లక్ష్మీనారాయణ, బాబూరావు, భాస్కర్‌రావు, తిరుపతి, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు



**అర్హుల ఓటు తొలగితే వెంటనే అప్పీల్ చేయాలి**

**పార్టీ బలోపేతానికి కార్యకర్తలే బలం**

**బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి**

జగిత్యాల, జూన్ 30 (ఈవార్తలు): అర్హుల ఓట్లు తొలగిపోకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వర్తక సంఘ భవనంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఓటరు ఉన్నారా లేదా అనే అంశాన్ని మాత్రమే పరిశీలించేవారని, ప్రస్తుతం 2002ను ప్రాతిపదికగా తీసుకోవడంతో ప్రజల్లో గందరగోళం నెలకొందన్నారు. ముఖ్యంగా వివాహిత మహిళలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారి ఓట్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి అవసరమైన పత్రాలు సమర్పించేలా సహకరించాలని కోరారు. ప్రతి 25 ఏళ్లకోసారి నిర్వహించే ఈ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జులై 25 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రాథమిక జాబితా విడుదలైన తర్వాత ఓటు తొలగినా, నెలరోజుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. బీఎల్‌వోలతో కలిసి పనిచేస్తే ఓటర్లతో అనుబంధం మరింత బలపడుతుందన్నారు. రాజకీయాల్లో గెలుపు పార్టీ నిబద్ధతకు ప్రామాణికమని, పార్టీ బలోపేతంతోనే నాయకుల భవిష్యత్తు ముడిపడి ఉంటుందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్, మున్సిపల్ చైర్మన్ రవీందర్, వైస్‌చైర్‌పర్సన్ సౌజన్య, తాటిపర్తి సీకే రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి 'ఆపరేషన్ ముస్కాన్' ప్రత్యేక తనిఖీలు

**బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు: ఏఎస్పీ చేతన్ నితిన్**

జగిత్యాల, జూన్ 30 (ఈవార్తలు): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల రక్షణ, పునరావాసమే 'ఆపరేషన్ ముస్కాన్--12' లక్ష్యమని జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ తెలిపారు. జులై 1 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు పిల్లలను ఏ పనిలోనైనా నియమించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. హోటళ్లు, టీ స్టాళ్లు, గ్యారేజీలు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు, గృహాలు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తించి రక్షిస్తామని తెలిపారు. రక్షించిన చిన్నారులకు వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్, విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు అవసరమైతే బాలల సంరక్షణ గృహాలకు తరలిస్తామని చెప్పారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై బాల కార్మిక, జువెనైల్ జస్టిస్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో బాలకార్మికులు లేదా భిక్షాటన చేస్తున్న చిన్నారులు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్--100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అంజన్నకు అగ్గిపెట్టెలో పట్టే శాలువా!

మల్యాల, జూన్ 30 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అగ్గిపెట్టెలో ఇమిడేంత సూక్ష్మంగా నేసిన ప్రత్యేక పట్టు శాలువాను కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారికి భక్తిపూర్వకంగా సమర్పించారు. అత్యంత సన్నని పట్టు దారాలతో ఎంతో శ్రమించి రూపొందించిన ఈ కళాఖండం ఆయన చేనేత నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. కొండగట్టు ఆలయానికి చేరుకున్న హరిప్రసాద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ అరుదైన పట్టు శాలువాను ఆలయ అధికారులకు అందజేశారు. అగ్గిపెట్టెలో సులభంగా ఇమిడిపోయే ఈ సూక్ష్మ శాలువా ఆలయానికి వచ్చిన భక్తులను, అధికారులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, శ్రీ ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతోనే ఈ ప్రత్యేక చేనేత కళాఖండాన్ని రూపొందించానని తెలిపారు. స్వామివారికి సమర్పించడం తన జీవితంలో మరపురాని అనుభూతిగా భావిస్తున్నానన్నారు.



దర్శ గుప్తా



## రెమ్యునరేషన్ కోసం కోర్టుకు

సినిమా సూపర్ హిట్ అయింది.. వంద కోట్లకు పైగా వసూళ్లను సాధించింది.. కానీ అదే మూవీకి దర్శకత్వం వహించిన దర్శకురాలు మాత్రం తనకు రావాల్సిన పారితోషికం కోసం కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. కోలీవుడ్ లో చోటుచేసుకున్న ఆ ఇన్సిడెంట్ ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ దర్శకురాలు సుధా కొంగర తనకు రావాల్సిన రూ.8.39 కోట్ల రెమ్యూనరేషన్ బకాయిల కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడంతో ఆ వివాదం తెరపైకి వచ్చింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రానికి దర్శకత్వం వహించిన సుధా కొంగర, నిర్మాతలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం తనకు మొత్తం రూ.15 కోట్ల పారితోషికం ఇవ్వాల్సి ఉందని పిటిషన్ లో పేర్కొన్నారు. జీఎస్టీతో కలిపి చెల్లించాల్సిన మొత్తం మరింత పెరిగిందని, అయితే ఇప్పటివరకు రూ.9.31 కోట్లు మాత్రమే చెల్లించి, ఇంకా రూ.8.39 కోట్లను నిర్మాణ సంస్థ ఇప్పటికీ ఇవ్వలేదని ఆమె తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదలైన పరాశక్తి బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. విడుదలైన కొద్ది రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్ లో చేరినట్లు నిర్మాతలే ప్రకటించారు. సినిమా సక్సెస్ అయినప్పటికీ, దర్శకురాలికి అగ్రిమెంట్ ప్రకారం చెల్లించాల్సిన మొత్తం ఇప్పటికీ ఇవ్వకపోవడం సరైంది కాదని సుధా కొంగర తరపు న్యాయవాదులు వాదించారు. ఇప్పటికే సినిమా ఓటీటీలో విడుదలైన నేపథ్యంలో, శాటిలైట్ హక్కులకు సంబంధించిన ట్రాన్సక్షన్స్ కొనసాగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తనకు రావాల్సిన బకాయిలు చెల్లించకుండా సినిమా ద్వారా కమర్షియల్ బెనిఫిట్స్ పొందడం కరెక్ట్ కాదని పేర్కొన్నారు. అందుకే చివరి నిమిషంలో కాకుండా ముందుగానే న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వివరించారు. ఆ పిటిషన్ పై విచారణ చేపట్టిన మద్రాస్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పరాశక్తి చిత్రానికి సంబంధించిన శాటిలైట్ స్ట్రీమింగ్ కు సంబంధించిన ప్రక్రియను జులై 8 వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అదే సమయంలో ఆ వ్యవహారంపై నిర్మాణ సంస్థ తమ వాదనలు వినిపించాలని సూచించింది. ఇక వివాదం మరో సినిమాపై ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే నిర్మాణ సంస్థ నిర్మించిన ఇదయం మురళి చిత్రం జులై 10న విడుదలకు సిద్ధంగా ఉంది. పాత సినిమా బకాయిలు చెల్లించకుండా కొత్త సినిమా విడుదల చేయడం సరికాదని పేర్కొంటూ, ఆ మూవీ రిలీజ్ కూడా నిలిపివేయాలని సుధా కొంగర కోర్టును కోరారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, జులై 7 లోపు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించింది. ఆ తర్వాత జరిగే విచారణలో తదుపరి నిర్ణయం తీసుకోనుంది. దీంతో ఇదయం మురళి విడుదలపై కూడా ఆసక్తి నెలకొంది.



## నా పిల్లల్ని చంపేస్తామని బెదిరిస్తున్నారు

ప్రముఖ నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఎక్స్ నుంచి తప్పుకుంటున్నట్లు ఓ పోస్ట్ షేర్ చేశాడు. ఇటీవల పూణెలో జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసుపై సినిమా తీయాలంటూ రాహుల్‌కు ఓ నెటిజన్ కామెంట్ పెట్టాడు. దానిపై రాహుల్.. మన సమాజంలో ఇప్పటికీ పితృస్వామ్య భావజాలం కూడా బలంగానే ఉందంటూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ సమాధానం నచ్చని కొందరు.. రాహుల్‌ను టార్గెట్ చేస్తూ విమర్శల దాడికి దిగారు. ఈ క్రమంలోనే ఓ నెటిజన్ ఆయన భార్య (గాయని చిన్మయి)ని, పిల్లలను చంపేస్తాం అంటూ కామెంట్ చేశాడు. ఈ కామెంట్‌ను స్క్రీన్ షాట్ తీసి ఎక్స్‌లో షేర్ చేసిన రాహుల్.. 'ఈ కామెంట్ చూసి నేను అనుభవించిన నరకం అంతా ఇంతా కాదు. పొరపాటున వచ్చిన నోటిఫికేషన్ చూశాను. అందులో నా పిల్లల ప్రాణాలను తీస్తామనే కామెంట్ చదివి నా మానసిక స్థితి పూర్తిగా మారిపోయింది. నాలో చెప్పలేనంత కోపం, బాధ ఒక్కసారిగా కట్టలు తెంచుకున్నాయి. చాలా సమయం తర్వాత నా హృదయ స్పందన నార్మల్ స్థితికి వచ్చింది. క్రీడల సమాచారానికి ఎక్స్ యాప్ ఒక మంచి వేదిక కాబట్టే ఇన్నాళ్లూ నెగెటివిటీ ఉన్నా భరిస్తూ వచ్చాను. కానీ నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, కుటుంబానికి హాని తలపెట్టేలా ఉన్న ఈ వాతావరణం ఇక చాలు. అందుకే తక్షణమే నా ఫోన్ నుండి ఈ యాప్‌ను తొలగిస్తున్నా. ఇకపై ఎక్స్‌కు దూరంగా ఉంటా' అంటూ ఓ సుధీర్ఘమైన పోస్టును పంచుకున్నాడు.

## కష్టపడుతున్నాం.. ఖర్చుపెడితే తప్పేంటి

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ గత కొద్ది కాలంగా ఫ్లాపులతో సతమతమవుతున్న ఈ భామ గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ భారీ విజయంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన ఐశ్వర్య.. వరుస అవకాశాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం ఐశ్వర్య రాజేష్ ఓ సుకుమారితో బిగ్ స్క్రీన్‌పై సందడి చేయనన్నారు. అలాగే 'ఇసాకపట్నం' అనే క్రైమ్ థ్రిల్లర్ సిరీస్‌తో ఓటీటీ ప్రియులను అలరించనున్నారు. అయితే ఈ సిరీస్ జూలై 2 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఈ సిరీస్‌కు సంబంధించిన అప్డేట్స్ సోషల్ మీడియాలో భారీ బజ్‌ను క్రియేట్ చేశాయి. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో.. ప్రమోషన్స్ జోరు పెంచిన ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఐశ్వర్య తన వ్యక్తిగత అలవాట్ల గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. సినిమా కోసం అంతలా కష్టపడినప్పుడు మనకు మనం బహుమతులు ఇచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆమె చెప్పుకొచ్చారు. "నేను నటించే ప్రతి సినిమా పూర్తయ్యాక నాకు నేను ఒక గిఫ్ట్ కొనుక్కుంటాను. అంత కష్టపడి పని చేసినప్పుడు మన కోసం మనం ఖర్చు పెట్టుకోవడంలో తప్పు లేదు" అని ఐశ్వర్య స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తన లైఫ్‌లో కొనుక్కున్న అత్యంత ఖరీదైన గిఫ్ట్ గురించి చెబుతూ.. "నా కెరీర్‌లోనే అత్యంత ఎక్స్‌పెన్సివ్ గిఫ్ట్ ఒక లగ్జరీ వాచ్. దాని ధర అక్షరాలా 15 లక్షల రూపాయలు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా పెద్ద హిట్ అయ్యాక.. ఆ చిత్రానికి వచ్చిన రెమ్యునరేషన్‌తో ప్రత్యేకంగా ఈ వాచ్ కొనుక్కున్నాను" అని వెల్లడించారు.





## పడిపోయిన మృణాల్ గ్రాఫ్

సీతారామం చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన మృణాల్ ఠాకూర్ తొలి చిత్రంతోనే సెన్సేషన్ క్రియేట్ చేశారు. ఆ సినిమా అందించిన విజయం తర్వాత అమ్మడు టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. కానీ గత నాలుగేళ్లలో ఆమె కెరీర్ గ్రాఫ్‌ను పరిశీలిస్తే ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు లేవనేది స్పష్టంగా కనిపిస్తోంది. సీతారామం తర్వాత నానితో చేసిన హాయ్ నాన్న మినహా చెప్పుకోదగ్గ పెద్ద సినిమాలు ఆమె ఖాతాలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. నాలుగేళ్ల సుదీర్ఘ కాలంలో మూడే మూడు చిత్రాలకు పరిమితం కావడం స్టార్ హీరోయిన్ రేసులో అమ్మడిని వెనుకబడేలా చేస్తోంది. ఈ పరిస్థితి చూస్తుంటే ఒకప్పటి కీర్తి సురేష్ కెరీర్ గమనం గుర్తుకురాక మానదు. మహానటి వంటి చారిత్రాత్మక విజయం తర్వాత కీర్తి కూడా ఇదే తరహాలో నెమ్మదించడంతో ఒక దశలో టాలీవుడ్‌లో ఆమె స్థానం ప్రశ్నార్థకమైంది. ఆ తర్వాత కీర్తి పద్ధతిని మార్చుకుని పాత్రల ఎంపికలో సరళత చూపడం, కమర్షియల్ సినిమాలకు కూడా ఓకే చెప్పడంతో మళ్లీ పుంజుకుంది.



## సోషల్‌గా సంపాదిస్తున్న..

2004లో చాంద్ కా రోషన్ చెహ్రా అనే హిందీ సినిమాతో కెరీర్ ప్రారంభించిన తమన్నా.. ఆ తర్వాత 2005లో మంచు మనోజ్ సరసన శ్రీ సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైంది. అలా మొదలైన ఈ మిల్కీ బ్యూటీ ప్రస్థానం 22 ఏళ్లుగా నటనా కెరీర్ పరంగా దిగ్విజయంగా కొనసాగుతోంది. సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియా వేదికగాను తమన్నా సంపాదన, క్రేజ్ మామూలుగా లేదు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో తమన్నాకు ఏకంగా 2.8 కోట్ల (28 మిలియన్లు) మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ రేంజ్ ఫాలోయింగ్‌తో సోషల్ మీడియాలో అత్యధిక ఆదరణ కలిగిన టాలీవుడ్ - బాలీవుడ్ స్టార్స్‌లో ఒకరిగా దూసుకుపోతోంది. తమన్నా షేర్ చేసే ప్రతి పోస్ట్ క్షణాల్లో వైరల్ అవుతూ మిలియన్ల కొద్దీ వ్యూస్ రాబడుతోంది. కేవలం ఫోటోలు, వీడియోలకే పరిమితం కాకుండా ఈ ఇన్‌స్టాగ్రామ్ క్రేజ్‌ను తమన్నా భారీగా క్యాష్ చేసుకుంటోంది. బ్రాండ్ ప్రమోషన్ల ద్వారా ఈ బ్యూటీ సంపాదిస్తున్న అంకెలు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో చేసే ఒక్కో ప్రమోషనల్ పోస్ట్ లేదా ఎండార్స్‌మెంట్‌కు తమన్నా సగటున రూ. 15 లక్షల నుండి రూ. 25 లక్షల వరకు భారీగా చార్జ్ చేస్తోంది. మిల్కీ బ్యూటీకి ఉన్న యూత్ ఫాలోయింగ్ - గ్లామర్, డ్యాన్సింగ్ స్కిల్ కారణంగా బ్రాండ్లు తమ సేల్స్ పెంచుకోవడానికి తమన్నాతో ప్రమోషన్లు చేయించడానికి క్యూ కడుతున్నాయి. ఇక సినిమాల విషయానికి వస్తే... సీనియర్ హీరోయిన్ అయినా రెమ్యునరేషన్ విషయంలో తమన్నా నేటి తరం యంగ్ హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తోంది. ప్రస్తుతం సౌత్ (టాలీవుడ్, కోలీవుడ్) లో ఒక్కో సినిమాకు ఈమె రూ. 2 నుండి 3 కోట్ల రేంజ్ లో వసూలు చేస్తోంది.



## హనీ రోజ్‌కు బాబీ చెమ్మనూర్ సారీ

కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్ తాజాగా నటి హనీ రోజ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెబుతూ కీలక ప్రకటన చేశారు. తన కామెంట్స్ వల్ల ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులు మానసికంగా బాధపడాల్సి వచ్చిందని అంగీకరిస్తూ, ఆ వ్యాఖ్యలకు పూర్తి బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం తన ఫేస్‌బుక్ అకౌంట్ లో ఒక సుదీర్ఘ పోస్టును షేర్ చేసిన చెమ్మనూర్, వివాదానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. తానెప్పుడూ ప్రతి ఒక్కరినీ గౌరవంతో, మర్యాదతో చూడాలనే ఆలోచనతోనే వ్యవహరిస్తానని బాబీ చెమ్మనూర్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అప్పుడప్పుడు సరదా, హాస్యభరితమైన పోస్టులు చేస్తుంటానని, అయితే ఎవరినైనా కించపరచడం లేదా వారి మనోభావాలను దెబ్బతీయడం తన ఉద్దేశం కాదని వివరించారు. అయినప్పటికీ, తన కామెంట్స్ హనీ రోజ్‌ను తీవ్రంగా బాధించినట్టు తాను గ్రహించానని తెలిపారు. తన కామెంట్స్ హనీ రోజ్‌తో పాటు ఆమె కుటుంబ సభ్యులకు కూడా గణనీయమైన మానసిక వేదన కలిగించాయని తనకు పూర్తిగా అర్థమైందని, తన కామెంట్స్ వల్ల వల్ల జరిగిన నష్టానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నానని, తన మాటలకు, వాటి ప్రభావానికి పూర్తి బాధ్యత వహిస్తున్నానని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ క్షమాపణను సానుకూలంగా స్వీకరించి తనపై నమోదు చేసిన క్రిమినల్ కేసును హనీ రోజ్ ఉపసంహరించుకోవాలని కూడా చెమ్మనూర్ విజ్ఞప్తి చేశారు. ఈ వివాదం న్యాయపరమైన పోరాటంగా కొనసాగకుండా పరస్పర అవగాహనతో ముగియాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.



# శ్రీచరణి నం.1

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో తెలుగు తేజం అగ్రస్థానం



**ఐసీసీ మంగళవారం ప్రకటించిన మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత లెఫ్టార్మ్ స్పిన్నర్ శ్రీచరణి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రస్తుతం జరుగుతున్న మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్, లారెన్ బెల్ అద్భుత ప్రదర్శనలతో అగ్రస్థానానికి చేరువైనప్పటికీ.. శ్రీచరణి నెం.1 స్థానాన్ని పదిలం చేసుకుంది.**

ఈ మెగా టోర్నీలో భారత జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించినప్పటికీ.. శ్రీచరణి మాత్రం 14 వికెట్లతో టోర్నీలోనే అత్యుత్తమ బౌలర్లలో ఒకరిగా నిలిచి తన నంబర్ వన్ ర్యాంకును కాపాడుకుంది. అయితే ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లు ఇంకా జరుగుతుండటంతో శ్రీచరణి అగ్రస్థానానికి గట్టి పోటీ ఎదురవుతోంది.

బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ ఓ స్థానం ఎగబాకి మూడో స్థానానికి చేరుకోగా.. అదే జట్టుకు చెందిన పేసర్ లారెన్ బెల్ మూడు స్థానాలు మెరుగుపరుచుకని నాలుగో ర్యాంకుకు చేరుకుంది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ నోంకుల్‌లేకో మ్లాబా ఓ స్థానం మెరుగై ఐదో స్థానంలో.. పాకిస్థాన్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నష్రా సంధు ఓ స్థానం వృద్ధి చెంది 9వ స్థానంలో నిలిచారు. ఇతర బౌలర్లలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మారిజానే కాప్ ఏడు స్థానాలు ఎగబాకి 14వ స్థానానికి, స్కాట్లాండ్ కెప్టెన్ కాథరిన్ బ్రైస్ 17 స్థానాలు దూసుకెళ్లి 26వ ర్యాంకుకు, న్యూజిలాండ్ సీమర్ బ్రీ ఇల్లింగ్ 6 స్థానాలు మెరుగుపరుచుకుని 31వ స్థానానికి చేరుకున్నారు. బ్యాటింగ్ విభాగంలో ఆస్ట్రేలియా ఓపెనర్ జార్జియా వోల్ తన ప్రపంచ నంబర్ వన్ స్థానాన్ని నెలబెట్టుకుంది. భారత్‌తో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్ లో అంతగా రాణించనప్పటికీ.. ఆమె అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ ఓ స్థానం మెరుగై సంయుక్తంగా మూడో స్థానానికి చేరుకోగా.. ఐర్లాండ్ పై అజేయ సెంచరీతో అదరగొట్టిన శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు రెండు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకును కైవసం చేసుకుంది. ప్రస్తుతం టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఇంగ్లాండ్ ఓపెనర్ డాని వ్యాట్-హాడ్జ్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 11వ స్థానానికి, ఆస్ట్రేలియా వెటరన్ ఎల్లీస్ పెర్రీ 17వ స్థానానికి, దక్షిణాఫ్రికాకు చెందిన అన్నేరి డెర్క్‌సెన్ 24వ స్థానానికి చేరారు. మహిళల టీ20 ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పు లేదు. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ తన నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోగా.. న్యూజిలాండ్‌కు చెందిన మెలీ కెర్ రెండో స్థానంలో కొనసాగుతోంది. అయితే ఐర్లాండ్‌కు చెందిన ఓర్లా ప్రెండర్‌గాస్ట్ రెండు స్థానాలు ఎగబాకి సంయుక్తంగా మూడో స్థానానికి చేరుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. మిగిలిన వారిలో మారిజానే కాప్ ఎనిమిదో స్థానానికి, బ్రైస్ 11వ స్థానానికి ఆస్ట్రేలియాకు చెందిన అనాబెల్ సదర్లాండ్ రెండు స్థానాలు ఎగబాకి 17వ ర్యాంకుకు చేరుకున్నారు.





# గట్టెక్కిన బ్రెజిల్

**ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో ఐదు సార్లు ఛాంపియన్ అయిన బ్రెజిల్‌కు పసికూన జపాన్ ముచ్చెమటలు పట్టించింది. సోమవారం అర్ధరాత్రి హోరాహోరీగా సాగిన నాకౌట్ మ్యాచ్‌లో బ్రెజిల్ 2-1 గోల్స్ తేడాతో గట్టెక్కింది. ఒక దశలో వెనుకబడిన బ్రెజిల్.. ఆఖరి నిమిషాల్లో లభించిన అవకాశాన్ని గోల్‌గా మలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.**

ఈ విజయంతో బ్రెజిల్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లగా.. జపాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ ఆరంభంలో బ్రెజిల్ ఆటగాళ్లు మథ్యూస్ కున్హా, బ్రూనో గుమారేస్ జపాన్ డిఫెన్స్‌ను ఛేదించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో ఆట 29వ నిమిషంలో బ్రెజిల్ డిఫెండర్ డానిలో చేసిన తప్పును అనుకూలంగా మార్చుకున్న జపాన్ మిడ్‌ఫీల్డర్ కైషు సానో.. బ్రెజిల్ రక్షణ శ్రేణిని ఛేదిస్తూ అద్భుతమైన గ్రౌండ్ షాట్‌తో గోల్ కొట్టాడు. దీంతో ఫస్టాఫ్ ముగిసేసరికి జపాన్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లో బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోట్టి వ్యూహాలు మార్చారు. బ్రెజిల్ ఆటగాళ్లు జపాన్ గోల్ పోస్ట్‌పై వరుస దాడులు చేశారు. ఈ క్రమంలో 56వ నిమిషంలో గాబ్రియేల్ మాగల్హాస్ అందించిన అద్భుత పాస్‌ను సీనియర్ ఆటగాడు కాసిమిరో హెడర్ ద్వారా గోల్‌గా మలిచి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత వినీషియస్ జూనియర్ కొట్టిన ఒక షాట్ పోస్ట్‌కు తగిలి వెనుదిరిగింది. మ్యాచ్ ఇంజూరీ టైమ్ (95వ నిమిషం)లో బ్రెజిల్ ఊహించని షాకిచ్చింది. జపాన్ బాక్స్ బయట బంతిని చేజిక్కించుకున్న బ్రూనో గుమారేస్, ప్రత్యామ్నాయ ఆటగాడిగా వచ్చిన గాబ్రియేల్ మార్టినెల్లీకి పాస్ ఇచ్చాడు. మార్టినెల్లీ ఏమాత్రం తప్పు చేయకుండా బంతిని నెట్‌లోకి పంపి బ్రెజిల్ క్యాంప్‌లో సంబరాలు నింపాడు. ఈ గోల్‌తో బ్రెజిల్ 2-1తో విజయం సాధించి తదుపరి రౌండ్‌లో ఐవరీ కోస్ట్ లేదా నార్వేతో తలపడటానికి సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో అసిస్ట్ అందించిన గుమారేస్, ఈ ప్రపంచకప్‌లో అత్యధిక అసిస్ట్‌లు (4) అందించిన ఆటగాడిగా నిలిచాడు. బ్రెజిల్ తరపున ఒకే ప్రపంచకప్‌లో దిగ్గజ పీలే (1970లో 6 అసిస్ట్‌లు) తర్వాత ఈ ఘనత సాధించిన ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు.



## ఇక ఇంగ్లండ్‌తో

# 'పొట్టి' పోటీ

### నేడు నాటింగ్‌హామ్ వేదికగా తొలి మ్యాచ్

ఐర్లాండ్ చేతిలో చిత్తుగా ఓడిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా ఆ జట్టుతో ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. బుధవారం నాటింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా.. హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టుతో తలపడనుంది. ఇటీవల ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో 2-0తో ఊహించని పరాజయం చవిచూసిన భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. మరోవైపే, ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్లో వాంఖడే స్టేడియం వేదికగా భారత్ చేతిలో 7 పరుగుల తేడాతో ఓటమి పాలైన ఇంగ్లండ్ జట్టు ఆ తర్వాత మరే టీ20 మ్యాచ్ ఆడలేదు. స్వదేశంలో జరగబోయే ఈ సిరీస్‌ను గెలుచుకుని ప్రపంచకప్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని ఇంగ్లండ్ పట్టుదలగా ఉంది. మరోవైపు ఈ సిరీస్ గెలిచి మళ్లీ విజయాల బాట పట్టాలనుకుంటుంది. ఈ టీ20 సిరీస్‌లోని ఐదు మ్యాచ్‌లు వేర్వేరు స్టేడియాల్లో జరగనున్నాయి. జూలై 1(బుధవారం)న చెస్టర్-లే-స్ట్రీట్‌లోని రివర్‌సైడ్ మైదానంలో తొలి మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత రెండో మ్యాచ్ మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో, మిగిలిన మూడు మ్యాచ్‌లు వరుసగా నాటింగ్‌హామ్‌లోని ట్రెంట్ బ్రిడ్జ్, బ్రిస్టల్‌లోని కౌంటీ గ్రౌండ్, సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ మైదానాల్లో జరగనున్నాయి. తొలి, మూడు, నాలుగో టీ20 మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 10:00 గంటలకు, రెండు , ఐదో మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి.

# పరాగ్వే సంచలన విజయం



ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో మరో సంచలన ఫలితం నమోదైంది. మాజీ ఛాంపియన్ జర్మనీకి పరాగ్వే షాకిచ్చింది. మంగళవారం తెల్లవారుజామున తీవ్ర ఉత్కంఠగా సాగిన ప్రి-క్వార్టర్స్ మ్యాచ్‌లో జర్మనీని పరాగ్వే షూటౌట్ చేసింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఎక్స్‌ట్రా టైమ్‌లోనూ ఇరు జట్లు సమంగా నిలవడంతో షూటౌట్ ద్వారా మ్యాచ్ ఫలితాన్ని తేల్చారు. పెనాల్టీ షూటౌట్‌లో పరాగ్వే 4-3తో జర్మనీపై చారిత్రాత్మక విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. మరోవైపు నాలుగు సార్లు ఛాంపియన్ అయిన జర్మనీ ఇంటిబాట పట్టింది. మ్యాచ్ ఆరంభం నుంచే పరాగ్వే దూకుడుగా ఆడింది. ఆట 42వ నిమిషంలో మథియాస్ గలార్జా అందించిన అద్భుత పాస్‌ను జూలియో ఎన్సిసో హెడర్ ద్వారా గోల్‌గా మలిచి పరాగ్వేకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ప్రపంచకప్ నాకౌట్ దశలో పరాగ్వేకు ఇదే తొలి గోల్ కావడం విశేషం. జర్మనీ ఆటగాళ్లు తొలి హాఫ్‌లో పూర్తిగా నిరాశపరిచారు. సెకండాఫ్‌లో జర్మనీ వ్యూహాలు మార్చింది. ఫ్లోరియన్ విర్ట్జ్ అందించిన క్రాస్‌ను కై హ్యావర్ట్జ్ హెడర్ ద్వారా గోల్‌గా మార్చి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత ఎక్స్‌ట్రా టైమ్‌లో జర్మనీ డిఫెండర్ జోనాథన్ తాహ్ హెడర్ ద్వారా గోల్ కొట్టినప్పటికీ, వీఏఆర్ సమీక్షలో రిఫరీ దాన్ని ఫౌల్‌గా ప్రకటించి రద్దు చేయడం తీవ్ర వివాదాస్పదమైంది. పిచ్ పక్కన ఉన్న మానిటర్‌లో రీప్లేను పరిశీలించిన మొరాకో రెఫరీ జలాల్ జాయే... తాహ్ హెడర్ కొట్టడానికి ముందే జర్మనీ డిఫెండర్ వాల్డెమార్ ఆంటన్, పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్‌ను రూల్స్‌కు విరుద్ధంగా అడ్డుకున్నాడని తేల్చాడు. ఆ ఫౌల్ కారణంగా ఆ గోల్‌ను రద్దు చేయడంతో.. మ్యాచ్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లే సువర్ణావకాశాన్ని జర్మనీ చేజార్చుకుంది. అయితే ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెనాల్టీ షూటౌట్‌లో పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ అద్భుత ప్రదర్శన చేశాడు.



# గంభీర్‌కు అశ్విన్ అండ

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అండగా నిలిచాడు. గంభీర్‌ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకుంటారని అభిప్రాయపడ్డాడు. ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ కావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఏ ఫార్మాట్‌లోనైనా ఐర్లాండ్ చేతిలో భారత్ సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి. ఈ ఘోర పరాజయం తర్వాత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలపై, టీమ్‌సెలెక్షన్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు ఆటగాళ్లను కావాలనే పక్కనపెట్టారని, గంభీర్ తన వ్యక్తిగత ఇష్టాయిష్టాల ప్రకారమే జట్టును ఎంపిక చేశాడనే ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ విమర్శలను రవిచంద్రన్ అశ్విన్ తప్పుబట్టాడు. గంభీర్‌ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అభిప్రాయపడ్డాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. భేదాభిప్రాయాలు ఉన్నంత మాత్రాన వారిని అసహ్యించుకుంటున్నట్లు కాదని స్పష్టం చేశాడు. భారత క్రికెట్‌లో భిన్నమైన అభిప్రాయాలను గౌరవిస్తూ, వాటిని వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో ముడిపెట్టకుండా ఉండటం నేర్చుకోవడానికి మరికొంత సమయం పడుతుందని వ్యాఖ్యానించాడు.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# కాంక్రీట్ అడవుల్లో మండుతున్న జీవితం

ఒకప్పుడు వేసవికాలం అంటే మధ్యాహ్నం కొన్ని గంటలపాటు మాత్రమే భరించలేని ఎండ ఉండేది. కానీ ఇప్పుడు ఉదయం నుంచే వేడి మొదలై అర్ధరాత్రి దాటినా నగరాలు చల్లబడటం లేదు. చెట్ల నీడలో కూర్చొని ఉపశమనం పొందే రోజులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. రోడ్లు, భవనాలు, ఫ్లైఓవర్లు, పార్కింగ్ స్థలాలు రోజంతా వేడిని గ్రహించి, రాత్రివేళ కూడా తిరిగి విడుదల చేస్తుండటంతో నగరాలు సహజంగా చల్లబడే ప్రక్రియ దెబ్బతింటోంది. శాస్త్రవేత్తలు దీనినే అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం అంటున్నారు. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు. ప్రజారోగ్యం, ఆర్థికాభివృద్ధి, విద్యుత్ వినియోగం, నీటి వనరులు, పట్టణ జీవన నాణ్యత, అన్నింటినీ ప్రభావితం చేసే బహుముఖ సంక్షోభం. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా ఎక్కువగా నమోదవుతాయి. దీనికి ప్రధాన కారణాలు కాంక్రీట్, తారు రోడ్లు, గాజు భవనాలు, వాహనాల కాలుష్యం, పరిశ్రమలు, చెట్ల కొరత. పచ్చని భూమి సూర్యరశ్మిని కొంతవరకు గ్రహించి, నీటి ఆవిరి ద్వారా చల్లదనాన్ని కల్పిస్తుంది. కానీ కాంక్రీట్ నిర్మాణాలు వేడిని నిల్వ చేసి రాత్రిపూట కూడా విడుదల చేస్తాయి. ఫలితంగా నగరాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా అసాధారణంగా ఎక్కువగా ఉంటాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, హీట్ ఐలాండ్ ప్రభావం వల్ల పెద్ద నగరాల్లో చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల కంటే 2 నుంచి 7 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటీవలి సంవత్సరాల్లో యూరప్ కూడా అపూర్వమైన వేడి తరంగాలను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు చల్లని వాతావరణానికి పేరొందిన దేశాలు ఇప్పుడు తీవ్ర ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్నాయి. స్పెయిన్, ఇటలీ, గ్రీస్, ఫ్రాన్స్, పోర్చుగల్ వంటి దేశాల్లో వేసవి కాలంలో 40 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అడవి మంటలు, నీటి కొరత, విద్యుత్ వినియోగం పెరగడం, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం వంటి సమస్యలు తీవ్రంగా కనిపిస్తున్నాయి. యూరప్‌లో 2022లో సంభవించిన తీవ్ర వేడి తరంగాల కారణంగా 60 వేలకుపైగా అదనపు మరణాలు సంభవించాయని పలు శాస్త్రీయ అధ్యయనాలు సూచించాయి. 2023, 2024, 2025 సంవత్సరాల్లో కూడా అనేక ప్రాంతాలు వరుసగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలను నమోదు చేశాయి. దీంతో వాతావరణ మార్పులు ఇక భవిష్యత్తు ముప్పు కాదు, వర్తమాన వాస్తవమనే విషయం ప్రపంచానికి స్పష్టమైంది. భారత్‌లోనూ పరిస్థితి భిన్నంగా లేదు. హైదరాబాద్, ఢిల్లీ, అహ్మదాబాద్, నాగ్‌పూర్, జైపూర్ వంటి నగరాల్లో వేసవి ఉష్ణోగ్రతలు ఏటేటా పెరుగుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఐటీ కారిడార్లు, భారీ అపార్ట్‌మెంట్లు, వేగవంతమైన పట్టణీకరణ, చెరువుల ఆక్రమణ, పచ్చని ప్రదేశాల తగ్గుదల హీట్ ఐలాండ్ ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయి. ఎయిర్ కండిషనర్ల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. అదే సమయంలో బయటకు విడుదలయ్యే వేడి నగర ఉష్ణోగ్రతలను మరింత పెంచుతోంది. ఇది ఒక దుష్ప్రభావ చక్రంగా మారుతోంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు ఎక్కువగా ప్రమాదానికి గురవుతున్నారు. వడదెబ్బ, డీహైడ్రేషన్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాస సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల పని గంటలు తగ్గి ఉత్పాదకత కూడా పడిపోతుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనాల ప్రకారం, తీవ్ర వేడి కారణంగా శ్రమ ఉత్పాదకతపై ప్రపంచవ్యాప్తంగా ప్రభావం పెరుగుతోంది. ప్రస్తుతం నగరాల అభివృద్ధి అంటే ఎత్తైన భవనాలు, వెడల్పైన రహదారులు, కొత్త వాణిజ్య సముదాయాలుగా భావిస్తున్నారు. కానీ భవిష్యత్తులో "చల్లని నగరం" అనే భావన కూడా అభివృద్ధికి ప్రమాణంగా మారాల్సిన అవసరం ఉంది. పర్యావరణానికి అనుకూలమైన పట్టణ ప్రణాళిక లేకపోతే భవిష్యత్తులో నగరాలు నివసించడానికి మరింత క్లిష్టంగా మారే ప్రమాదం ఉంది. యూరప్‌లో నమోదవుతున్న రికార్డు స్థాయి వేడి తరంగాలు ప్రపంచానికి ఒక హెచ్చరిక. హైదరాబాద్ వంటి భారత నగరాలు కూడా అదే దిశగా పయనించకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలి. వాతావరణ మార్పులను కేవలం ప్రకృతి వైపరీత్యంగా కాకుండా, పట్టణ పాలనలో ప్రధాన అంశంగా చూడాల్సిన సమయం ఆసన్నమైంది.



# ప్రాణదాతల సేవకు ప్రణామం

## (నేడు జాతీయ వైద్యుల దినోత్సవం)

ప్రతి మనిషి జీవితంలో అత్యంత విలువైనది ప్రాణం. ఆ ప్రాణాన్ని కాపాడేందుకు తన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, సమయాన్ని, అవసరమైతే తన వ్యక్తిగత జీవితాన్నే పక్కన పెట్టి సేవ చేసే వ్యక్తి వైద్యుడు. అందుకే సమాజంలో గురువు తర్వాత అత్యంత గౌరవనీయమైన స్థానం వైద్యుడిదని అంటారు. భారత వైద్య రంగానికి విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి, వర్ధంతి రెండూ జూలై 1వ తేదీనే కావడం గమనార్హం. ఆయన సేవలకు గుర్తింపుగా జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. వైద్య వృత్తి అనేది ఉపాధి మాత్రమే కాదని, అది మానవసేవకు అంకితమైన మహోన్నత ధర్మమని ఆయన జీవితం చాటి చెప్పింది. వైద్యుడు కేవలం రోగానికి మందు ఇచ్చేవాడు మాత్రమే కాదు. రోగిలో ఆశను నింపేవాడు. ఆందోళనలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెప్పేవాడు. ఎన్నో సందర్భాల్లో ఒక చిరునవ్వుతోనే రోగికి సగం ఉపశమనం కలిగించేవాడు. వైద్యుడి మాట, వైద్యుడి స్పర్శ, వైద్యుడి నమ్మకం అనేక మందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తాయి. అందుకే వైద్యులను ప్రత్యక్ష దైవంగా భావించే సంప్రదాయం మన సమాజంలో ఏర్పడింది. ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో వైద్యుల సేవలను దేశం ఎన్నటికీ మరచిపోలేదు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, ప్రాణాలకు తెగించి, రాత్రింబవళ్లు ఆసుపత్రుల్లో సేవలందించిన వైద్యులు నిజమైన కరోనా యోధులుగా నిలిచారు. రక్షణ కవచాలు ధరించి గంటల తరబడి పనిచేస్తూ, వేలాది మంది ప్రాణాలను కాపాడేందుకు వారు చేసిన త్యాగం అపూర్వం. కొంతమంది వైద్యులు తమ ప్రాణాలను సైతం కోల్పోయారు. సమాజం కోసం చేసిన ఆ త్యాగం వైద్య వృత్తి గొప్పతనానికి చిరస్మరణీయ నిదర్శనం. అయితే నేటి కాలంలో వైద్య రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పెరుగుతున్న జనాభా, జీవనశైలి మార్పులతో వస్తున్న కొత్త వ్యాధులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అందిపుచ్చుకోవాల్సిన అవసరం, పెరుగుతున్న పని భారం, వైద్యులపై దాడులు వంటి అంశాలు వారిపై తీవ్ర ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. కొందరు వ్యక్తుల నిర్లక్ష్యం లేదా వ్యాపార ధోరణిని మొత్తం వైద్య సమాజానికి ఆపాదించడం సమంజసం కాదు. లక్షలాది మంది వైద్యులు నేటికీ సేవాభావంతోనే తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వాల బాధ్యత కూడా ఇక్కడ ఎంతో కీలకం. ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను విస్తరించడం, వైద్యులకు తగిన మౌలిక వసతులు, భద్రత, ఆధునిక పరికరాలు అందించడం అత్యవసరం. అలాగే వైద్య విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడం, పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా దేశ ఆరోగ్య వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలి. రోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా వైద్యులను భాగస్వాములుగా చూడాలి. చికిత్సలో ఓర్పు, పరస్పర విశ్వాసం, వైద్యుల సూచనల పట్ల గౌరవం అవసరం. వైద్యుడు ఎంత నిపుణుడైనా ప్రతి ప్రాణాన్ని కాపాడటం ప్రతి సందర్భంలో సాధ్యం కాదు. అలాంటి పరిస్థితుల్లో ఆవేశానికి లోనై వైద్యులపై దాడులు చేయడం సమాజానికి శ్రేయస్కరం కాదు. వైద్యులు భయరహిత వాతావరణంలో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. మన దేశ అభివృద్ధికి ఆరోగ్యవంతమైన సమాజం మూలస్తంభం. ఆ ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యతను వైద్యులు భుజాన వేసుకుని నిత్యం నిర్వర్తిస్తున్నారు. వారి సేవలకు కృతజ్ఞతలు తెలపడం ఒక్కరోజుకే పరిమితం కాకూడదు. వారి పట్ల గౌరవం, విశ్వాసం, సహకారం ప్రతి రోజూ ఉండాలి. వైద్య వృత్తి పవిత్రతను కాపాడుతూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత వైద్యులపై ఎంత ఉందో, వారిని గౌరవించి ఆదరించే బాధ్యత సమాజంపై కూడా అంతే ఉంది. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రతి వైద్యుడికి హృదయపూర్వక వందనాలు. ప్రాణాలను కాపాడే ఈ మహోన్నత సేవ ఎల్లప్పుడూ నిరంతరంగా కొనసాగాలని, ప్రతి వైద్యుడి సేవా తపన మరెన్నో జీవితాలకు వెలుగునివ్వాలని ఆకాంక్షిద్దాం. ఎందుకంటే ఆరోగ్యమే మహాభాగ్యం అయితే, ఆ భాగ్యాన్ని కాపాడేవారు వైద్యులే.





వెంకటేశ్ గుగ్గిళ్ల
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్


# దేశ నిర్మాణంలో సీఏ పాత్ర

ఒక వైద్యుడు అనారోగ్యం రాకముందే ఆరోగ్యాన్ని కాపాడాలని సూచిస్తాడు. అదే విధంగా ఒక చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) ఆర్థిక సంక్షోభం రాకముందే కుటుంబ భవిష్యత్తును రక్షించే మార్గాన్ని చూపిస్తాడు. అందుకే ప్రతి భారతీయ కుటుంబానికి సంవత్సరానికి ఒకసారి ఆర్థిక ఆరోగ్య పరీక్ష (ఫైనాన్షియల్ చెక్-అప్) కూడా అవసరమే. ప్రతి కుటుంబానికీ ఒక కల ఉంటుంది.

....నేడు చార్టెడ్ అకౌంటెంట్ డే....




ఎన్నో సంవత్సరాల పొదుపుతో ఇల్లు కొనాలనుకునే తండ్రి.. కూతురు చదువుల కోసం ప్రతి నెలా కొంత మొత్తం దాచుకునే తల్లి... ఉద్యోగాన్ని వదిలి వ్యాపారం ప్రారంభించే యువకుడు... తదుపరి తరానికి మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆశతో భూమిని విక్రయించే రైతు... పదవీ విరమణ తర్వాత ప్రశాంత జీవితం కోసం జీవితకాల పొదుపును పెట్టుబడిగా మార్చే ఉద్యోగి... వీరి కలలు వేర్వేరైనా, ఒక విషయంలో మాత్రం అందరూ ఒకే పరిస్థితిని ఎదుర్కొంటారు. అదే జీవితాన్ని ప్రభావితం చేసే కీలక ఆర్థిక నిర్ణయాలు. దురదృష్టవశాత్తు ఇలాంటి నిర్ణయాలు చాలాసార్లు నిపుణుల సలహాల ఆధారంగా కాకుండా బంధువుల అభిప్రాయాలు, స్నేహితుల సూచనలు, సోషల్ మీడియాలో చూసిన వీడియోలు లేదా వాట్సాప్ సందేశాల ఆధారంగా తీసుకుంటుంటారు. పన్ను నోటీసు వచ్చినప్పుడు, బ్యాంకు రుణం తిరస్కరించబడినప్పుడు, కుటుంబ వివాదాలు తలెత్తినప్పుడు లేదా భారీ ఆర్థిక నష్టం జరిగిన తర్వాత మాత్రమే నిపుణుల వద్దకు వెళ్లడం మన సమాజంలో సాధారణంగా కనిపించే దృశ్యం. అప్పుడు వినిపించే మాట ఒక్కటే... ' మీ సలహా తీసుకుని ఉంటే బాగుండేది!' అని. ఇది కేవలం పశ్చాత్తాపం కాదు. అవగాహన లేకుండా తీసుకున్న నిర్ణయాలు ఎంతటి మూల్యం చెల్లించాల్సి వస్తుందో చెప్పే చేదు అనుభవం.

ఒకప్పుడు ఆర్థిక జీవితం చాలా సరళంగా ఉండేది. బ్యాంకులో పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెన్షన్... అంతే. కానీ నేటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మొబైల్ ఫోన్ ద్వారానే విదేశీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్న యువత... ఇంటి నుంచే ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహిస్తున్న గృహిణులు... స్టార్టప్‌ల కోసం పెట్టుబడులు వెతుకుతున్న యువ పారిశ్రామికవేత్తలు... మ్యూచువల్ ఫండ్లు, బీమా, డిజిటల్ ఆస్తులు, రిటైర్మెంట్ పథకాలలో పెట్టుబడులు పెట్టే కుటుంబాలు... జీఎస్టీ, ఆదాయపు పన్ను, చట్టపరమైన నిబంధనలు, సాంకేతిక మార్పులను ఎదుర్కొంటున్న వ్యాపారవేత్తలు... ఇలా ఆర్థిక అవకాశాలు విస్తరించిన కొద్దీ ప్రమాదాలూ పెరిగాయి. ఇప్పుడు ఇల్లు కొనడం అంటే కేవలం స్థలం లేదా భవనం కొనడం కాదు. పన్నులు, రుణాలు, చట్టపరమైన పత్రాలు, భవిష్యత్ వారసత్వ ప్రణాళిక వంటి అంశాలు దానితో ముడిపడి ఉంటాయి. వ్యాపారం ప్రారంభించడం అంటే కేవలం ఒక మంచి ఆలోచన ఉండటం సరిపోదు. సరైన చట్టబద్ధ నిర్మాణం, ఆర్థిక క్రమశిక్షణ, పన్నుల నిర్వహణ, భవిష్యత్ విస్తరణకు ప్రణాళిక అన్నీ అవసరం. పదవీ విరమణ ప్రణాళిక అంటే కేవలం డబ్బు కూడబెట్టడం కాదు. ద్రవ్యోల్బణం, ఆరోగ్య వ్యయాలు, కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక భద్రతను కల్పించడం. ఈ ప్రతి దశలోనూ సరైన నిర్ణయం తీసుకునేందుకు నిపుణుల సలహా కీలకం. అక్కడే చార్టర్డ్ అకౌంటెంట్ పాత్ర ప్రారంభమవుతుంది.

చాలామంది సీఏ అంటే ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే వ్యక్తి లేదా ఆడిట్ నిర్వహించే నిపుణుడిగానే భావిస్తారు. కానీ వారి అసలు బాధ్యత అంతకంటే ముందే మొదలవుతుంది. ఆస్తి కొనుగోలు చేయకముందు... వ్యాపారం ప్రారంభించకముందు... పెట్టుబడి పెట్టకముందు... రుణ ఒప్పందంపై సంతకం చేయకముందు... కుటుంబ సంపదను తదుపరి తరానికి బదిలీ చేయకముందు... సరైన దిశానిర్దేశం ఇవ్వడం సీఏల అసలు సేవ. వారి గొప్పతనం చట్టాలను పాటించేలా చేయడంలో మాత్రమే కాదు; భవిష్యత్తులో పెద్ద నష్టాలకు దారితీసే తప్పులను ముందుగానే నివారించడంలో ఉంది. అలాంటి విజయాలు వార్తల్లో కనిపించకపోవచ్చు. కానీ వేలాది కుటుంబాలు, వ్యాపారాలు నిలదొక్కుకోవడానికి అవే పునాది అవుతాయి. 'సీఏ' అనే రెండు అక్షరాల వెనుక ఎన్నో సంవత్సరాల కఠోర సాధన, క్రమశిక్షణ, శిక్షణ, కఠిన పరీక్షలు, నైతిక విలువలు, నిరంతర అధ్యయనం దాగి ఉంటాయి. అర్హత సాధించడం విద్య ముగింపు కాదు; మరింత పెద్ద బాధ్యతకు ఆరంభం. ప్రతి కేంద్ర బడ్జెట్‌తో పన్ను చట్టాలు మారుతున్నాయి. అకౌంటింగ్ ప్రమాణాలు మారుతున్నాయి. వ్యాపార విధానాలు రూపాంతరం చెందుతున్నాయి. ఇప్పుడు కృత్రిమ మేధ కూడా ఆర్థిక రంగాన్ని పూర్తిగా మార్చేస్తోంది. అయినప్పటికీ, ఒక కుటుంబ ఆశయాలను అర్థం చేసుకోవడం, క్లిష్ట పరిస్థితుల్లో నైతిక నిర్ణయం తీసుకోవడం, ఆ నిర్ణయానికి బాధ్యత వహించడం మాత్రం యంత్రాలకు సాధ్యం కాదు. అది మనిషికే సాధ్యం. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే మౌలిక వసతులు, పరిశ్రమలు, సాంకేతికత, పెట్టుబడులు అవసరమే. కానీ వీటన్నింటికంటే ముఖ్యమైనది నమ్మకం. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి, పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టడానికి, ప్రభుత్వాలు సమర్థంగా పనిచేయడానికి, కుటుంబాలు సంపదను నిర్మించడానికి ఈ నమ్మకమే పునాది. ఆ నమ్మకాన్ని బలోపేతం చేయడంలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర అత్యంత కీలకం. చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా సమాజం సీఏలను వారి కష్టపడి చదివినందుకు లేదా ఎక్కువ గంటలు పనిచేస్తున్నందుకు మాత్రమే అభినందించాల్సిన అవసరం లేదు. అంతకంటే ముఖ్యంగా, ప్రతి కుటుంబం సమాచారంతో కూడిన సరైన ఆర్థిక నిర్ణయాల విలువను గుర్తించాలి. ఇల్లు కొనేముందు... ఆస్తి అమ్మేముందు... వ్యాపారం ప్రారంభించేముందు... పదవీ విరమణ పొదుపులను పెట్టుబడిగా మార్చేముందు... ఎవరికైనా గ్యారంటీ ఇచ్చేముందు... కుటుంబ ఆస్తులను బదిలీ చేసేముందు... భవిష్యత్తును ప్రభావితం చేసే ఏ పత్రంపైనా సంతకం చేసేముందు ఒక్కసారి ఆగాలి. నిపుణుల సలహా తీసుకోవాలి. ఎందుకంటే అత్యంత ఖరీదైన ఆర్థిక తప్పిదాలు చెడు ఉద్దేశంతో జరగవు. ముఖ్యమైన నిర్ణయాలు చాలా సులభమని భావించడం వల్లే జరుగుతాయి. చివరికి సంపద అనేది ఎక్కువ సంపాదించడం వల్ల మాత్రమే రక్షించబడదు. మెరుగైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే రక్షించబడుతుంది. ఆ మెరుగైన నిర్ణయాలు జ్ఞానం, నైతికత, సరైన సమయంలో తీసుకున్న సలహాతో ప్రారంభమవుతాయి. చార్టర్డ్ అకౌంటెన్సీ సంఖ్యలతో మాత్రమే సంబంధం ఉన్న వృత్తి కాదు... అది నమ్మకాన్ని నిర్మించే బాధ్యత. ఆ నమ్మకమే ప్రతి గొప్ప దేశ నిర్మాణానికి అసలైన పునాది.




సీఏ మణిశంకర్ పీ
చార్టెడ్ అకౌంటెంట్, హైదరాబాద్



**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.